కుటుంబ కలహాల నేపథ్యంలో ఘర్షణ

భార్య చెంపపై కొట్టిన భర్త.. అక్కడికక్కడే మృతి చెందిన మహిళ

- 5లో

స్వర్ణయుగమే

- టీడీపీ, జనసేన ఉమ్మడి బీసీ డిక్లరేషన్‌తో బీసీలకు మళ్లీ మంచిరోజులు
- వైసీపీ పాలనలో నలిగిపోయి చితికిపోయిన బీసీల్లో ఆనందోత్సాహాలు
- తిరిగి ఆదరణ పథకం ప్రారంభిస్తామన్న డిక్లరేషన్ ప్రకటనతో భరోసా
- రూ.4 వేలకు పెన్షన్ పెంపు, ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామనడంతో ఉత్సాహం
- బీసీ భవనాలు, కమ్యునిటీ హాళ్లు ఏడాదిలో పూర్తి చేస్తామనడంతో మళ్లీ పునరుజ్జీవం
- 1986 తర్వాత నుంచీ జరగని బీసీల కులగణనను చట్టబద్ధంగా చేస్తామని హామీ
- జిల్లాలో వైసీపీ ఐదేళ్ల పాలనలో అన్ని బీసీ పథకాలు రద్దు
- పథకాలు తీసేసి మొక్కుబడిగా జిల్లాలో 13,314మందికి మాత్రమే చేయూత

మాట్లాడితే నా బీసీ.. నా బీసీ... అంటూ ఇన్నాళ్లు వారిని నిలువునా మోసం చేసిన జగన్ సర్కారుకు టీడీపీ, జనసేన కూటమి గట్టి షాక్ ఇచ్చింది. ఉమ్మడి డిక్లరేషన్ ప్రకటనతో వైసీపీ పాలనలో నలిగిపోయిన బీసీలకు సాంత్వన చేకూర్చేలా కీలక నిర్ణయాలు ప్రకటించింది. బీసీలను కేవలం ఓట్ల కోసమే వాడుకుని వారిని ఐదేళ్లుగా అణగదొక్కిన జగన్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేలా డిక్లరేషన్ ఆయుధాన్ని బయటకు వదిలింది. అధికారం చేతిలో ఉన్నా ఏదీ చేయకుండా బీసీలను మోసం చేసిన తీరును ఎండగట్టింది. తిరిగి అధికారంలోకి వచ్చాక పూర్వవైభవం తీసుకువస్తామని ఎలుగెత్తి చాటింది.



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

వైసీపీ అటకెక్కించి కక్షతో రద్దుచేసిన అనేక కీలక సంక్షేమ పథకాలను తిరిగి అమలుచేస్తామని చెప్పి జిల్లాలో బీసీల్లో టీడీపీ, జనసేన కూటమి ధైర్యం నింపింది. మళ్లీ మునుపటి స్వర్ణయుగాన్ని తెస్తామని చాటింది. ఆదరణ, బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం, కుల గుణన, స్థానిక సంస్థలు, నామినేటెడ్ పోస్టుల్లో రిజర్వేషన్లు, బీసీ భవనాల నిర్మాణం ఇలా అనేక కీలక అంశాలపై తన అజెండా ప్రకటించింది. కాగా వైసీపీ అధికారంలోకి వచ్చాక బీసీలపై కక్షతో ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఆదరణ పథకం దరఖాస్తులు, సిద్ధంగా ఉన్న పనిముట్లను పక్కన పారేసింది. స్వయం ఉపాధికి ఊతమిచ్చే ఓబీ ఎంఎంఎస్, ఎంబీసీ పథకాలన్నీ రద్దు చేసేసింది. విదేశీ విద్య, ఉపకార వేతనాల్లో కోత కోసేసింది. అన్నింటి స్థానంలో తూతూమంత్రంగా జగనన్న చేయూత పథకం ఒక్కటే అమలు చేసి ఏటా 13,314మందికి రూ.10 వేల చొప్పున ఇచ్చి చేతులు దులిపేసుకుంది.

మళ్లీ 'ఆదరణ' అమలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1986 లెక్కల ప్రకారం.. 15.65లక్షల మంది బీసీలున్నారు. ఆ తర్వాతనుంచి ఇప్పటివరకు బీసీలకు సంబంధించి కులగణన జరగలేదు. దీంతో అన్నింటా సంక్షేమ పథకాలు, ఇతర రిజర్వేషన్లలో వీరంతా అన్యాయానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో బీసీలకు వెన్నుముకగా పేరొందిన టీడీపీ తాజాగా బీసీ డిక్లరేషన్ ప్రకటించడంతో జిల్లాలో బీసీలకు తిరిగి ఊపిరందినట్టయింది. ప్రస్తుత లెక్కల ప్రకారం అంచనాగా చూసినా ఉమ్మడి జిల్లాలో 19 లక్షల 80 వేల మంది బీసీలు ఉంటారని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ, జనసేన ప్రభుత్వం రాగానే చట్టబద్ధంగా కులగణన చేపడతామని ప్రకటించడంతో ఇన్నేళ్ల సమస్యకు పరిష్కారం దొరుకుతుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.5వేలకోట్లతో ఆదరణ పథకం ప్రారంభిస్తామని ప్రకటించడంతో తిరిగి బీసీల్లో ధైర్యం వచ్చినట్లయింది. గత టీడీపీ ప్రభుత్వం ఆదరణ-1, ఆదరణ-2 పథకం పేరుతో జిల్లాలో బీసీల్లో ఆయా కులాలవారీగా పలు వృత్తులకు సంబంధించిన కోట్ల విలువైన లక్షలాది పనిముట్లను అందించింది. రజకుల దగ్గరనుంచి కల్లుగీత కార్మికులు, నాయిబ్రాహ్మణులు ఇలా అనేకమందికి పనిముట్లను అందించి అండగా నిలబడింది. తీరా వైసీపీ అధికారంలోకి రాగానే ఆదరణ పథకాన్ని పూర్తిగా రద్దు చేసేసింది. అప్పటికే ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వేలాదిమంది దరఖాస్తులను పక్కన పారేసింది. వీరంతా కట్టిన డబ్బులకు సంబంధించి జిల్లాకు చేరిన వేలాది కిట్లను మూలనపడేసింది. దీంతో బీసీలంతా తీవ్రంగా ఇబ్బంది పడ్డారు.

ప్రత్యేక రక్షణ చట్టంపై హర్షం

డిక్లరేషన్‌లో పేర్కొన్న విధంగా బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టంతో బీసీల్లో ఆనందం ఉప్పొంగుతోంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో జిల్లాలో అనేక రకాల దాడులు జరిగాయి. కల్లుగీత కార్మికుల దగ్గరనుంచి నాయీబ్రాహ్మణులు, రజకులపై అధికారులు, వైసీపీ నేతలు జరిపిన దాడులకు లెక్కలేదు. ఈ నేపథ్యంలో ప్రత్యేక రక్షణ చట్టంతో బీసీలకు ఊరట లభించినట్లయింది. వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన పారిశ్రామిక ప్రోత్సాహకాలు తిరిగి అమలుచేస్తామని తాజాగా టీడీపీ, జనసేన డిక్లరేషన్‌లో పేర్కొనడంతో బీసీల్లో ఆనందం వ్యక్తమవుతోంది. తిరిగి తమకు పూర్వవైభవం వస్తుందనే ధీమాను వారంతా వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి గత టీడీపీ ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో బీసీలకోసం బీసీ కార్పొరేషన్ ద్వారా ఓబీ ఎంఎంఎస్ పథకాన్ని అమలు చేసింది. ఏదైనా వ్యాపారం చేసుకోవాలనుకుని ముందుకు వచ్చిన లబ్ధిదారులకు రూ.లక్ష సబ్సిడీ, మరో రూ.లక్ష లోన్ అందించి ఆర్థికంగా ఎదగడానికి తోడ్పడింది. ఎంబీసీ పథకం ద్వారా రూ.30 వేలు అందించి వ్యాపారులు ప్రోత్సహించింది. జగన్ ప్రభుత్వం వచ్చాక ఇవన్నీ రద్దు చేసి పారేసింది. దీంతో ఆర్థికంగా నిలదొక్కుకుని స్వయం ఉపాధిపై నిలబడాలనుకున్న బీసీలంతా రోడ్డున పడ్డారు. బీసీ భవనాలు, కమ్యూనిటీ హాళ్లను ఏడాదిలోగా నిర్మిస్తామన్న డిక్లరేషన్ ప్రకటనతో బీసీలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కనిపించినవన్నీ కబ్జా చేసిన వైసీపీ

గత టీడీపీ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాలో బీసీలకు ప్రతి నియోజకవర్గంలో బీసీ భవనాలు, కమ్యునిటీ హాళ్ల మంజూరయ్యాయి. వీటి నిర్మాణానికి స్థలాలు, నిధులు కూడా విడుదలయ్యాయి. దోబీ ఘాట్‌ల నిర్మాణానికి కూడా రూ.లక్షల్లో నిధులు మంజూరయ్యాయి. కానీ వైసీపీ అధికారంలోకి రాగానే వీటి నిర్మాణాన్ని ఎక్కడికక్కడ నిలిపివేసింది. స్థలాలు మంజూరైన చోట వాటిని స్థానిక వైసీపీ నేతలు కబ్జా చేసేశారు. బీసీల్లో ఆయా సామాజికవర్గాల వారీగా కార్పొరేషన్లు, నిధులు, బీసీలకు నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్లు ఇస్తామని డిక్లరేషన్‌లో పొందుపరచడంతో వైసీపీ పాలనతో తాము ఎలా నలిగిపోయామో గుర్తుచేసుకుని బీసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో పేరుకు బీసీలకు కొన్ని కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా చిల్లిగవ్వ కూడా నిధులు కేటాయించలేదు. దీంతో అవన్నీ అలంకారప్రాయంగా మారాయి. ఇప్పుడు డిక్లరేషన్ ద్వారా రిజర్వేషన్ అమలు చేస్తామని టీడీపీ చెప్పడంతో ఎందరో బీసీలకు పదవులు లభించనున్నాయి. బీసీల్లో ఉన్న అనేక ఉపకులాల్లో తక్కువ జనాభా ఉన్నవారికి, ఎన్నికల్లో పోటీ చేయలేని వర్గాలకు కోఆప్షన్ సభ్యులుగా అవకాశం ఇస్తామని చెప్పడంతో వారందరికీ తొలిసారిగా గుర్తింపు లభించే అవకాశం ఏర్పడింది. టీడీపీ పాలనలో జిల్లాలో బీసీలకు ముప్పైకి పైగా పథకాలు అమల్లో ఉండేవి. కానీ బీసీలను కేవలం ఓటర్లుగానే చూసిన వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇవన్నీ రద్దు చేసేసింది. కేవలం జగనన్న చేయూత పథకం ఒక్కటే మహిళలకు అందుబాటులోకి తెచ్చింది. ఇందులోను రకరకాల కోతలు కోసి ఉమ్మడి తూ.గో. జిల్లాలో ఏడాదికి 36,177 మందికి మాత్రమే రూ.పది వేలు ఇచ్చి మమ అనిపిస్తోంది.

ఐదేళ్లుగా నష్టపోయిన వారు లక్షల్లోనే..

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 5: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బీసీలు అత్యధికంగా ఉన్నారు. ఇందులో శెట్టిబలిజలు పది లక్షల మంది ఉన్నారు. ఇందులో గీత వృత్తి సుమారు 30 వేల మంది ఉన్నారు. గతంలో గీత కార్మికులకు ఆదరణలో రెండు క్యాన్లు, ఒక సైకిల్, రూ. పది వేల నగదు వచ్చేవి. బీసీ కార్పొరేషన్ రుణాలు రూ. పది వేలు ఇచ్చేవారు. జగన్ వచ్చాక మొత్తం మూతపడ్డాయి. దురదృష్టవశాత్తూ చెట్టు పైనుంచి పడి గీతకార్మికుడు మరణిస్తే రూ. 5 లక్షల చంద్రన్న బీమా ఇచ్చేవారు. జగన్ వచ్చాక పరిహారం కింద ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. అదేవిధంగా నాయీ బ్రాహ్మణులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 30 వేల మంది ఆదరణ పథకంలో పరికరాలు తీసుకునేవారు. ఈ పథకం రద్దు కావడంతో చాలా ఇబ్బందులుపడ్డారు. జిల్లావ్యాప్తంగా పలు ఆధునిక పరికరాల వినియోగంపై శిక్షణ ఇచ్చేవారు. అదీ లేదు. కార్పొరేషన్ నిధులు లేవు. ఇటు రుణాలు రాక అవస్థలు పడుతున్నారు. అదేవిధంగా విశ్వబ్రాహ్మణులు పంచవృత్తులపై ఆధారపడి జీవనం సాగించేవారు. వారిలో శిల్పులు, బంగారం పని చేసే వారికి ఆదరణ పథకం ద్వారా లబ్ధి జరిగేది. ఇప్పుడు లేదు. పద్మశాలీలు, దేవాంగులు వారి వారి చేతి వృత్తులకు అభివృద్ధికి గత టీడీపీ ప్రభుత్వం ఆదుకుంది. గత ఐదేళ్లుగా వారికీ సంక్షేమం లేదు. అగ్నికుల క్షత్రియులు కూడా ఎన్నో పథకాలు కోల్పోయారు.

బీసీ డిక్లరేషన్ శుభపరిణామం



బీసీలను జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. నిధులు దారి మళ్లించి సంక్షేమాన్ని విస్మరించింది. అందుకే బీసీలను అభివృద్ధి చేసేందుకు చంద్రబాబు బీసీ డిక్లరేషన్ ప్రకటించారు. ఇది శుభ పరిణామం. బీసీల ఆత్మగౌరవాన్ని మా నాయకుడు చంద్రబాబు నిలబెట్టారు. ఇంతకాలం బీసీలకు రక్షణ లేదు. ఇక అటువంటివి చెల్లవు. బీసీ రక్షణ చట్టాన్ని టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి వచ్చాక తీసుకువస్తుంది. రూ.5 వేల కోట్లతో ఆదరణ పథకం పునరుద్ధరణ, స్వయం ఉపాధికి ఐదేళ్లలో రూ.10 వేల కోట్లు ఖర్చు చేయడం, రూ.లక్షన్నర కోట్లతో బీసీ సబ్‌ప్లాన్, చట్టసభల్లో 33 శాతానికి రిజర్వేషన్ కోసం తీర్మానం చేసి కేంద్రానికి పంపించడం, స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు 34 శాతానికి పెంచడం అద్భుతం.

- ఆదిరెడ్డి శ్రీనివాస్, టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి, రాజమహేంద్రి

త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

- ఎన్నికల విధులను చట్టబద్ధతతో నిర్వర్తించాలి
- జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కే మాధవీలత

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 5: త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న దృష్ట్యా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. మంగళవారం ఎన్నికల విధులు-బాధ్యతలపై కలెక్టరేట్‌లో జేసీ ఎస్.తేజ్‌భరత్, జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులుతో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, ఉత్తర్వుల మేరకు చేపడుతున్న కార్యకలాపాలు సమర్థవంతంగా చేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి రెవెన్యూ అధికారి సమన్వయకర్తగా కీలకమైన బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. నోటిఫికేషన్ విడుదల కాగానే పనులకు ఎటువంటి జాప్యానికి తావులేకుండా చేయాలన్నారు. ఈసమావేశంలో ఏవో బీవీఎస్ రావు, కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు.



విజ్జేశ్వరం బ్యారేజీ మీద భారీ వాహనాలు వెళ్లకుండా ఏర్పాటుచేసిన గడ్డర్లను తొలగించడంతో లారీలు, ఇసుక లారీలు ప్రయాణిస్తున్న దృశ్యం

బ్యారేజీపై ఇసుక దొంగలు!

- ఇరిగేషన్ సిబ్బందిపై దాడి.. విజ్జేశ్వరం వద్ద గడ్డర్లు తొలగించి స్కవర్ స్లూయిజ్‌లో పడేసిన వైనం
- కొవ్వూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా స్పందన కరవు
- ఇసుక లారీలతో ఇటీవల వేసిన రోడ్డు ధ్వంసమయ్యే పరిస్థితి

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

ధవళేశ్వరం-విజ్జేశ్వరం మధ్య గోదావరి కాటన్ బ్యారేజీ మీద మళ్లీ ఇసుక దొంగలుపడ్డారు. ఐదేళ్లుగా ఈ బ్యారేజీ రోడ్డు అధ్వానంగా ఉండడంతో జనం నరకం అనుభవించారు. కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఆదేశాలతో ఇక్కడ కొంతమేర రోడ్డు మరమ్మతులు, నిర్మాణం చేయించిన సంగతి తెలిసిందే. ఆ పనులు ఇంకా పూర్తిస్థాయిలో ముగియలేదు. కానీ ఈలోగా ఇసుకలోడ్‌తో భారీ లారీలు ఈ రోడ్ల మీద, రాత్రీ పగలూ దూసుకుపోతున్నాయి. అంతే కాదు ఇసుకాసురులు ఎంతకు తెగించారంటే బ్యారేజీ రక్షణ కోసం కాపలా ఉన్న లస్కర్ల మీద దాడిచేశారు. విజ్జేశ్వరం వైపు నుంచి భారీ వాహనాలు రాకుండా రోడ్డుకు అడ్డంగా పెట్టిన గడ్డర్లను భారీ వాహనాలతో గుద్దించి, వాటిని తొలగించి, సమీపంలోని స్కవర్ స్లూయిజ్‌లో పడేశారు. అడ్డుకున్న వారిని కొట్టారు. ఈ ఘటన ఈనెల 1వ తేదీ రాత్రి వేళ జరిగింది. ఇరిగేషన్ అధికారులు దీనిపై స్పందించి కొవ్వూరు రూరల్‌పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇంతవరకూ స్పందన లేదు. వాస్తవానికి కాటన్ బ్యారేజీ మీద భారీ వాహనాలు, లోడ్ వాహనాలు నిషిద్ధం. దీంతో విజ్జేశ్వరం వైపు భారీ వాహనాలు వెళ్లకుండా గడ్డర్లు ఏర్పాటుచేశారు. ఇటీవల రాజవరం, బొబ్బర్లంక తదితర ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు మొదలయ్యాయి. అక్కడ నుంచి విజ్జేశ్వరం మీదగా నిడదవోలు, తాడేపల్లిగూడెం వైపు, రావులపాలెం వైపు ఇసుక తరలిస్తున్నారు. బెంజ్‌లారీలను ఉపయోగించి రాత్రి వేళల్లో కూడా తరలిస్తున్నారు. దీనికి గడ్డర్లు అడ్డువచ్చాయి. ఈనెల 1వ తేదీ రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో కోనసీమ ముఖద్వారానికి చెందిన ఓ వైసీపీ ఎమ్మెల్యే వర్గీయులుగా ఉన్న మద్దూరులంక, బొబ్బర్లంక గ్రామాలకు చెందిన కొద్దిమంది ఈ గడ్డర్లను భారీ వాహనాలతో గుద్దించి స్కవర్ స్లూయిజ్‌లో పడేశారు. ఈ సమయంలో విధుల్లో ఉన్న వాచ్‌మన్ బొర్రా సత్యనారాయణ, సహాయకుడు బొర్రా సత్తిబాబు అడ్డురావడంతో వారిపై ఇసుకాసురులు దాడిచేసి గాయపరిచారు. చంపేస్తామని కూడా హెచ్చరించారు. ఇదే పరిస్థితి గతేడాది కూడా జరిగింది. అప్పట్లో ఇసుకాసురులు లస్కర్లపై దాడిచేస్తే ఇరిగేషన్ ఉద్యోగులు ఆందోళన చేసి అక్కడ గడ్డర్లు ఏర్పాట్లు చేశారు. వాటినే ఇప్పుడు తొలగించి పడేశారు. వాచ్‌మన్‌పై దాడి, గెడ్డర్ల తొలగింపుపై ఇరిగేషన్ ఏఈ కె.నాగలక్ష్మి ఇటీవల కొవ్వూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కానీ ఇంతవరకూ స్పందనలేదు. ఉద్యోగులపై దాడిచేసినా, ఐరన్ గడ్డర్లు తొలగించినా, నిబంధనలకు విరుద్ధంగా బ్యారేజీపై ఇసుక లారీలు దూసుకుపోతున్నా, ఏమీ పట్టించుకోవద్దని ఇరిగేషన్ అధికార్లపై వైసీపీ నేతలు, ఉన్నతాధికారులు కూడా ఒత్తిడి చేయడం గమనార్హం. ఈనేపథ్యంలో ఉద్యోగులు భయంతో విధులు నిర్వహిస్తున్నారు. తొలగించిన గడ్డర్ల స్థానంలో ఇప్పటివరకు తిరిగి ఏర్పాటుచేయలేదు. ఇదే పరిస్థితి కొనసాగితే బ్యారేజీ ధ్వంసం అవుతుంది. ఇప్పటికైనా చర్యలు చేపడతారో లేదో వేచిచూడాలి.



చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జక్కంపూడి భార్య రాజశ్రీ, ఎంపీపీ, జడ్పీటీసీ

వైసీపీ ఆధ్వర్యంలో వలంటీర్లు, ఆశ, అంగన్‌వాడీలకు వస్త్రాల పంపిణీ

సీతానగరం, మార్చి5: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మండలంలోని బొబ్బిల్లంక పంచాయతీ కార్యాలయంలో వైసీపీ ఆధ్వర్యంలో ఆశ, అంగన్‌వాడీ, వలంటీర్లకు సోమవారం వస్త్రాలు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి రజాక్ స్వయంగా కార్యక్రమంలో పాల్గొనడం విశేషం. పార్టీ కార్యక్రమాలను అధికారిక కార్యక్రమాలుగా ఎలా నిర్వహిస్తారని ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రజాక్‌ను టీడీపీ నాయకులు ప్రశ్నించారు. తనకు ఎంపీడీవో నుంచి సర్క్యులర్ వచ్చిందని, దాంతో దగ్గరుండి జరిపిస్తున్నానని చెప్పడంతో సర్క్యులర్ చూపించమని తెలుగుదేశం నాయకులు పెండ్యాల మోహన్, కొత్తపల్లి వీర్రాజు, పెండ్యాల అవిస్వామి, పోలిన కృష్ణ, మణికంఠ తదితరులు కార్యదర్శిని నిలదీశారు. సర్క్యులర్ తన వద్ద లేదని తర్వాత చూపిస్తానని చెప్పడంతో టీడీపీ నాయకులు అభ్యంతరం చెబుతూ జనసేన నేత బత్తుల బలరామకృష్ణ, టీడీపీ నేత బొడ్డు వెంకటరమణ చౌదరిలను తీసుకువచ్చి తాము కూడా కార్యక్రమాలు చేపడతామని దగ్గరుండి చేయాలని కార్యదర్శిని కోరారు. మీరు కూడా సర్క్యులర్ తెచ్చుకోండని కార్యదర్శి అనడంతో కొద్దిసేపు వాగ్వాదం జరిగిన ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ కార్యక్రమానికి సంబంధించి ఎటువంటి ఫొటోలు తీయవద్దని వైసీపీ నాయకులు అడ్డగించడంతో వీరికి టీడీపీ నాయకులకు మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. కాగా స్థానికంగా ఉన్న వలంటీర్లు, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లకు మగవారికి ప్యాంటు షర్టు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో వైసీపీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి రాజశ్రీతోపాటు ఎంపీపీ, జడ్పీటీసీ తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో వైసీపీ నాయకులు ఇలా తాయిలాలు ఇవ్వడం పట్ల ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

తాయిలాల వలతో



- వైసీపీ బహుమతుల నజరానా
- డిన్నర్‌సెట్లు, చీరలు వగైరా..
- వలంటీర్లపై మళ్లీ దొంగ ప్రేమ
- ఆశాలు, అంగన్వాడీలకూ బురిడీ
- మంత్రి చెల్లుబోయిన అధికార దుర్వినియోగంపై జనం మండిపాటు
- తాజాగా బొబ్బిలంకలో చీరల పంపిణీ
- గిఫ్టుల ఖర్చు ఏ ఖాతాలోకో మరి

'సిద్ధం' అంటూ తెరముందు చెప్పేవి పౌరుష పదజాలం.. తెరవెనుక నిస్సిగ్గుగా తాయిలాలతో గేలం.. ఇదీ వైసీపీ నాయకుల ప్రలోభాల కథా చిత్రమ్. ఎన్నికల నోటిఫికేషన్ ఏ క్షణంలోనైనా రావచ్చనే సమయంలో వైసీపీ నేతలు విచ్చలవిడిగా బహుమతులతో ఓటర్లకు వల విసరడం మొదలు పెట్టేశారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బందిని ఈ కుతంత్రంలో భాగస్వాములను చేశారు. ఓటర్ల లిస్టులను పరిశీలించి, వలంటీర్ల వద్ద ఆరా తీసి తాయిలాల పంపకానికి సిద్ధపడుతున్నారు. ఈ పనిని తమ అనుయాయులకు ప్రత్యేకంగా అప్పగించారు. ప్రాంతాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి మరీ ప్రలోభాలను పంచిపెడుతున్నారు. వలంటీర్లది అసలు ఉద్యోగమే కాదని చెప్పిన నోటితోనే పొగుడుతూ.. ఆశాలు, అంగన్వాడీలను ముప్పు తిప్పలు పెట్టిన అధికారంతోనే మభ్యపెడుతూ మళ్లీ మోసానికి సిద్ధమంటూ తాయిలాల వలవిసురుతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేసరికే 'చక్కబెట్టేసి'.. నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఖర్చు విషయంలో తాము సుద్ద పూసలమనే రీతిలో ముందస్తు తాయిలాల పంపిణీ కానిచ్చేస్తున్నారు.

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

జగన్ ప్రభుత్వం వచ్చాక నిలువునా దగాపడిన వాళ్లలో ముందువరుసలో వలంటీర్లు ఉంటారు. సేవ ఎక్కువ రాబడి తక్కువ కావడంతో ఆర్థికంగానూ ఇబ్బందుల్లో మునిగిపోయారు. పీజీలు చదివినవారు సైతం ఉద్యోగ జీవితంలో ఈరోజు కాకపోతే రేపైనా ఎదుగుదల ఉంటుందనుకొని.. ప్రభుత్వం ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేయకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో వలంటీర్లుగా చేరారు. కేవలం రూ.5 వేలకు చాకిరీ విధులకు ఒప్పుకున్నారు. కొద్దిరోజుల కిందట తమకు జీతాలు పెంచాలని వలంటీర్లు గొంతెత్తక తప్పలేదు. అయితే అసలు మీది ఉద్యోగమే కాదు.. సేవ అని తేల్చేశారు. కానీ ఇప్పుడు వైసీపీ నాయకులకు వలంటీర్లే గతయ్యారు. వారి ద్వారానే ఎన్నికల ప్రలోభాల సినిమా నడిపిస్తున్నారు. ఈ ఐదేళ్ల కాలంలో వలంటీర్ల ద్వారా ఆయా కుటుంబాల డేటాను సేకరించారు. అది అంతా ప్రభుత్వం వద్ద ఉంది. ఇప్పుడు ఆ జాబితా ద్వారా ప్రతి వలంటీర్లు ఇన్ని ఓట్లు ఫ్యానుకు వేయించాలంటూ తాయిలాలతో భ్రమపెడుతున్నారు. దీనిని కొందరు వలంటీర్లు వ్యతిరేకిస్తుండగా.. కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియలో వలంటీర్ల నీడ ఎట్టి పరిస్థితుల్లోనూ పడడానికి వీలు లేదని కేంద్ర ఎన్నికల సంఘం హెచ్చరింపులను కూడా వైసీపీ నాయకులు పట్టించుకోలేనంతగా బరితెగిస్తున్నారు. అవ్వాతాతలను తీసుకొచ్చి ఓటు వేయించాలంటూ సాక్షాత్తూ జగన్ చెప్పడం ప్రజాస్వామ్యవాదులకు విస్మయం కలిగిస్తోంది.

● ఆశాలు, అంగన్వాడీలకు దగా

ఆశాలు అడిగినవన్నీ చేసేస్తాం.. అంగన్వాడీలకు తెలంగాణకంటే ఎక్కువ జీతాలు ఇచ్చేస్తాం.. గత ఎన్నికల్లో జగన్ చేసిన వాగ్దానాలవి. కానీ తర్వాత వాళ్లను పట్టించుకున్న దాఖలాలు లేవు. ఐదేళ్లలో ఎన్నోసార్లు తమ న్యాయమైన డిమాండ్లు తీర్చాలంటూ వినతిపత్రాలు అందించినా కనీసం కన్నెత్తి చూడలేదు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయాలని అడిగినా ప్రభుత్వంలో కదలిక రాలేదు. చివరకు ఆశాలు, అంగన్వాడీలు నెలల తరబడి రోడ్లెక్కి నిరసన చేయాల్సి వచ్చింది. వాళ్లను పోలీసుల సహాయంతో బంధించి సంతకాలు చేయించుకొని పంపించారు. ఇటు అంగన్వాడీ సెంటర్ల తాళాలు సచివాలయ సిబ్బందితో బద్దలు కొట్టించిన ఘనత మూటగట్టుకున్నారు. ఎన్నికల వేళ మళ్లీ వాళ్లను వైసీపీ ప్రభుత్వం దగా చేస్తోంది. తాయిలాలు ఇస్తూ మభ్యపెడుతోంది. గత ఎన్నికల సమయంలో జగన్ మాటలు నమ్మిన ఆశాలు, అంగన్వాడీలు ఇంటింటికీ వెళ్లి ఫ్యానుకు ఓటేస్తామని ప్రమాణాలు చేయించుకున్నారు. జగన్ అప్పట్లో ఎడాపెడా హామీలను గుప్పించి ఆశాలు, అంగన్వాడీ వర్కర్ల ద్వారా పెద్ద మేలే పొందారు. తర్వాత మోసం ఎలా ఉంటుందో చూపించారు.

● చెల్లుబోయిన.. ఇలా చెయ్యొచ్చా..!

వైసీపీలో చిన్నపెద్దా తేడా లేదు. ఎవరి దారిలో వారు ఓటర్లను ప్రలోభ పెట్టే పనిలో బిజీ అయిపోయారు. పగలు వీధుల్లో తిరగడం.. రాత్రివేళల్లో తాయిలాల తంతు కానివ్వడంలో బిజీ అయిపోయారు. దీనికోసం కుటుంబీకులు, బంధువులను కూడా రంగంలోకి దింపుతున్నారు. అనుయాయులను వారికి జత చేస్తున్నారు. సమాచార ప్రసార శాఖామంత్రి అయిన చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఓటర్లను ప్రలోభ పెట్టడంలో ఏకంగా తాయిలాల తరలింపునకు ప్రభుత్వ వాహనాన్ని సిబ్బందిని వాడేస్తున్నారు. సమాచారశాఖకు చెందిన వ్యాను ఒకటి కొన్ని నెలలుగా రాజమహేంద్రవరంలోని వేణు తాత్కాలిక నివాసం వద్ద అందుబాటులో ఉంచుతున్నారు. సమాచార శాఖ కమిషనర్ ఒప్పుకోకపోయినా ఆయనపై ఒత్తిడి తీసుకొచ్చి మరీ ఆ వ్యాన్‌ను మంత్రిగారు తాత్కాలికంగా సొంతం చేసుకున్నారు. దీంతో ప్రభుత్వ డ్రైవర్ ఇతర సిబ్బంది కూడా వాహనంతోపాటు అందుబాటులో ఉంటున్నారు. ఆయన పోటీలో ఉన్నట్టు చెబుతున్న రాజమహేంద్రవరం రూరల్‌లో వైసీపీ మీటింగులకు జనాలను తరలించడానికీ ఆ వాహనాన్ని వాడుతున్నారు. మరీ బరితెగించి ధవళేశ్వరంలో పంచడానికి గిఫ్ట్‌ల తరలింపునకూ ఆ వాహనాన్ని వాడడంపై తీవ్ర విమర్శలు రేకెత్తుతున్నాయి. ఇందులో భాగంగా ప్రభుత్వ, సచివాలయ సిబ్బందితో మంత్రి చెల్లుబోయిన వేణు కుమారుడు ఏ హోదాలో సమావేశం ఏర్పాటుచేశారో సమాధానం దొరకని ప్రశ్నగా మారింది.

● ఈ ఖర్చు ఏ ఖాతాలోకి?

ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఖర్చు పెట్టే ప్రతి పైసాకు ఎన్నికల సంఘానికి లెక్క చెప్పాల్సి ఉంటుంది. ఎన్నికల సంఘం నియమించే పరిశీలకులు ఎప్పటికప్పుడు లెక్కలు గమనిస్తూ ఉంటారు. దీంతో ఎన్నికల నోటిఫికేషన్ రాకకు ముందే ఓట్లను బుట్టలో వేసుకునే పనిలో వైసీపీ నాయకులు నిమగ్నమయ్యారు. ఇప్పుడైతే ఖర్చును ఎవరికీ చెప్పాల్సిన పని ఉండదు. లెక్కలు ఇష్టానుసారం రాసేసుకోవచ్చు. బిల్లులను గోల్‌మాల్ చేసేసినా అడిగేవారుండరు. దీంతో వైసీపీ నాయకులు ఎక్కడిక్కడ చీకటి వేళల్లో మీటింగులు పెట్టి తాయిలాల పంపకం చేస్తున్నారు. దీనికి లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఇటీవల వైవీ సుబ్బారెడ్డి చేసిన వ్యాఖ్యలను బట్టి ఇప్పటి వరకూ వైసీపీ ఎవరినీ అభ్యర్థులుగా ప్రకటించలేదు. మార్చి 10న మేదరిమెట్ల సభ తర్వాత ఆ తతంగం ఉంటుందని ఆయన తేల్చేశారు. అయినా.. వైసీపీ సిట్టింగులు, బదిలీలపై వచ్చిన వాళ్లు ఖర్చులో ఎక్కడా తగ్గడం లేదు. జిల్లాలోని రాజమహేంద్రవరం రూరల్, సిటీ, గోపాలపురం నియోజకవర్గాల విషయంలో ఒక స్పష్టత ఉన్నప్పటికీ రాజానగరం, నిడదవోలు, అనపర్తి నియోజకవర్గాల్లో ఇంకా ఎటూ తేలలేదు. కానీ అక్కడి సిట్టింగ్‌లంతా ఎన్నికల నేపథ్యంలో ముఖ్య పాత్ర వహించే వారికి తాయిలాల పంపిణీకి విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారు. ఈ ఖర్చంతా ఏ ఖాతాల్లో లెక్కలు చూపిస్తారో ఫ్యాను గాలికే తెలియాలి.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు

తప్పును నిలదీస్తే చెప్పుతో కొడతా అంటావా

- భరత్‌రామ్.. నిన్ను చెప్పులతో కొట్టడానికి ప్రజలు సిద్ధం
- మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, జనసేన నేత అనుశ్రీ

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 5: రాజమహేంద్రవరంలో ఒక వలంటీరు వైసీపీకి అనుకూలంగా లేకపోతే సంక్షేమ పథకాలు రద్దు చేస్తామని ప్రచారం చేస్తుంటే.. ఆ తప్పును తాను నిలదీస్తే తనను చెప్పుతో కొడతా అని ఎంపీ భరత్‌రామ్ అనడం అతని కుసంస్కారానికి నిదర్శనమని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన, జనసేన సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ ఏడు నియోజకవర్గాల ప్రజలు నిన్ను ఎంపీగా గెలిపిస్తే రాజమహేంద్రవరానికి పరిమితమై మిగతావాటిని గాలివదిలేస్తే, అక్కడ ప్రజలు చెప్పులతో నిన్ను కొట్టడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. రాళ్ల పేర్చి, లైట్లు వెలిగించి దానిని అభివృద్ధి అని అనడం సిగ్గుమాలిన చర్య అన్నారు. నువ్వు చేసిన అవినీతి అక్రమాలను కచ్చితంగా ప్రశ్నిస్తామన్నారు. ఆవభూములు, బ్యూటిఫికేషన్ పేరుతో నువ్వు ఎంత దోచేశావో టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి వచ్చాక అన్నీ నిగ్గుతేలుస్తుందన్నారు. జనసేన నేత అనుశ్రీ సత్యనారాయణ మాట్లాడుతూ ఆదిరెడ్డి అప్పారావుపై ఎంపీ భరత్‌రామ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎంపీ భరత్‌రామ్‌కు బెల్ట్ దెబ్బలు తినే రోజులు దగ్గరపడుతున్నాయన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు, అధికార ప్రతినిధి దాస్యం ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ద్వారా పార్వతి సుందరి, తెలుగు మహిళా పార్లమెంట్ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి, నగర అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ, ఆర్గనైజింగ్ సెక్రటరీ మీసాల నాగమణి పాల్గొన్నారు.

నేడు భీమేశ్వరుని కల్యాణం




సామర్లకోట, మార్చి 5: కాకినాడ జిల్లా సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభాన్ని పురస్కరించుకుని బుధవారం విఘ్నేశ్వర పూజ, అంకురారోపణ, దీక్షా ధారణలో పూజలు





ప్రారంభమవుతాయి. మధ్యాహ్నం స్వామి వారు, అమ్మవార్ల దేవతామూర్తులను నంది వాహనంపై అలం కరించి గ్రామోత్సవం నిర్వహిస్తారు. రాత్రి 8.10 గంటలకు ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన ప్రత్యేక వేదికపై వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి, అమ్మవార్ల దివ్య కల్యాణ మహోత్సవం జరగనుంది. అన్నవరం సత్యదేవుని ఆలయ ప్రధాన అర్చకుల పర్యవేక్షణలో ఘనంగా కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం తెలిపారు.

నేటి నుంచి కల్యాణోత్సవాలు

- పాదగయలో ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు



పిఠాపురం, మార్చి 5: కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా తొలిరోజు బుధవారం వివిధ ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు కుక్కుటేశ్వర స్వామికి, రాజరాజేశ్వరీ అమ్మవారికి పంచామృత స్నానం, ఉదయం 9 గంటలకు అంకురార్పణం-ధ్వజారోహణం ఉదయం 11 గంటలకు కుక్కుటేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన, రాజరాజేశ్వరి అమ్మవారికి లక్ష కుంకుమార్చన, లక్షపత్రిపూజ నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు స్వామి, అమ్మవార్లకు పెండ్లికుమారుడు, కుమార్తె అలంకారం, సాయంత్రం 5 గంటలకు గజవాహనంపై గ్రామోత్సవం, 6 గంటలకు రామకృష్ణ వాసవి కన్యకా పరమేశ్వరీ కల్యాణ మండపం వద్ద ఎదురుసన్నాహం, రాత్రి 8.32 గంటలకు స్వామి, అమ్మవార్ల దివ్య కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు.

రెండు బైక్‌లు ఢీ

ఇద్దరి మృతి..ఒకరి పరిస్థితి విషమం


గౌతమ్

లక్ష్మణ్

కాట్రేనికోన, మార్చి 5: కాట్రేనికోన మండలం పల్లం కుర్రు పంచాయతీ పరిధిలో వడ్డివారిపేట సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మరణించారు. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పల్లంకుర్రుకు చెందిన కన్నీడి లక్ష్మణ్ (20), సూర్యతేజ బలుసుతిప్ప నుంచి వస్తూ ఎదురుగా భార్యతో వస్తున్న స్థానిక వైద్యుడు మట్టా సిద్ధార్థగౌతమ్(56) వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో లక్ష్మణ్ అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన గౌతమ్, ఆయన భార్య మణిను స్థానికులు కాట్రేనికోన పీహెచ్‌సీకి తరలించారు. అనంతరం కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సిద్ధార్థగౌతమ్ మంగళవారం మరణించారు. ఆయన భార్య పరిస్థితి కూడా విషమంగానే ఉన్నట్టు, సూర్యతేజ సురక్షితంగానే ఉన్నట్టు తెలిసింది.

ప్రసాద్ స్కీం పనులకు రేపు శంకుస్థాపన

అన్నవరం, మార్చి 5: కేంద్ర ప్రభుత్వ పథకం ప్రసాద్ స్కీం ద్వారా అన్నవరం ఆలయానికి రూ.20 కోట్లు మంజూరవడంతో దీనికి సంబంధించిన పనులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 7న వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించి అన్నవరం దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతోంది. రామాలయ ప్రాంగణంలో సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు పనుల ప్రారంభం కార్యక్రమాన్ని తిలకించేలా భారీ స్క్రీన్ ఏర్పాటు చేస్తున్నారు. రూ.20 కోట్లతో టీటీడీ సత్రం వద్ద అన్నదాన నూతన భవనం, క్యూ కాంప్లెక్స్, ప్రకాష్‌సదన్ వెనుక భాగంలో భక్తులకు టాయిలెట్స్, ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు తదితర వాటికి వినియోగించనున్నారు. స్వామివారి వ్రతకథను హిందీలోకి అనువదించాలని ఎప్పటినుంచో ప్రయత్నాలు జరుగుతున్నా నేటికి అమలులోకి రాలేదు. త్వరలో ఈ దిశగా ప్రయత్నాలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

లారీ ఢీకొని యువకుడి మృతి



మృతిచెందిన జేమ్స్‌బాబు

రాజమహేంద్రవరం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొనడంతో ఓ యువకుడు మృతిచెందాడు. ద్రాక్షారామ మండలం ఉంటూరుకు చెందిన డి.జేమ్స్‌బాబు (25) రాజమహేంద్రవరంలోని ఐసీఐసీఐ బ్యాంకులో పని చేస్తుంటాడు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో తన బైక్‌పై విధులకు వస్తున్నాడు. మోరంపూడి జంక్షన్ వద్దకు చేరుకునే సరికి లారీ వేగంగా ఢీకొట్టడంతో కింద పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో ఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచాడు. బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

25 టన్నుల రేషన్‌బియ్యం పట్టివేత



ఆలమూరు: రేషన్ బియ్యాన్ని పట్టుకున్న అధికారులు

అమలాపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి)/ఆలమూరు: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో విజిలెన్స్ రీజనల్ ఎస్పీ కేవీఎస్వీ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు ఆలమూరులో మంగళవారం తనిఖీలు చేపట్టారు. కల్యాణ చక్రవర్తి వే బ్రిడ్జి సమీపంలో అశోక్ లేలాండ్ లారీని రాజమహేంద్రవరం విజిలెన్స్ సీఐ టి.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో విజిలెన్స్, రెవెన్యూ సివిల్ సప్లయిస్ అధికారులు తనిఖీ చేశారు. 460 తెలుపు రంగు ప్లాస్టిక్ బస్తాలు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌కు చెందిన 40 గోనె సంచులు.. మొత్తం 500 బస్తాల్లో సుమారు 25 వేల కిలోల పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్టు గుర్తించారు. కృష్ణా జిల్లా పామర్రుకు చెందిన శ్రీగౌతమి రైస్ అండ్ ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ యజమాని గొట్టిపు రమేష్‌బాబు నుంచి పీడీఎస్ బియ్యాన్ని కాకినాడకు చెందిన వి.శ్రీనివాసరావుకు సరఫరా చేస్తున్నట్టు డ్రైవర్ పెద్దిరెడ్డి రాజేష్ అధికారులకు తెలిపారు. సుమారు రూ.21.37 లక్షల విలువైన పీడీఎస్ బియ్యం, వాహనాన్ని సీజ్ చేసి 6(ఎ) కేసు నమోదు చేసి క్రిమినల్ కేసు కోసం పోలీస్‌స్టేషన్‌కు సిఫార్సు చేసినట్టు అధికారులు తెలిపారు. బియ్యాన్ని ఆలమూరు ఎంఎస్‌వోకు అప్పగించగా మండపేట ప్రభుత్వ గోదాముకు తరలించారు. లారీని ఆలమూరు పోలీసులకు అప్పగించారు. ఆలమూరు ఎస్ఐ శ్రీను నాయక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు శ్రీనివాసరెడ్డి, భార్గవమహేష్, అలీషా, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు పాల్గొన్నారు.

20 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

కొవ్వూరు, మార్చి 5: అక్రమంగా తరలిస్తున్న 20 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్టు కొవ్వూరు సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్ జి.బాపిరాజు తెలిపారు. ఉండ్రాజవరం నుంచి కాకినాడ పోర్టుకు లారీలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారని సమాచారం రావడంతో సివిల్ సప్లయిస్ అధికారులు మంగళవారం తెల్లవారుజామున దాడులు చేశారు. కొవ్వూరు ఏషియన్ పెయింట్స్ గొడౌన్ సమీపంలో నేషనల్ హైవేపై లారీని సీజ్‌చేసి, లారీలో ఉన్న 20 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. కాకినాడ జిల్లా కరపకు చెందిన లారీ డ్రైవర్ రాయుడు బాలాజీ, లారీ యజమాని నల్లా శివ, తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం గ్రామానికి చెందిన బియ్యం యజమాని బాషా 6ఏ కేసు నమోదు చేసినట్టు బాపిరాజు చెప్పారు.

ఘనంగా వైద్యనాదేశ్వరస్వామి కల్యాణం

జగ్గంపేట, మార్చి 5: కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాకలో కోటిపార్థివ లింగ మహా రుద్రాభిషేకం దిగ్విజయంగా కొనసాగుతోంది. మంగళవారం విఘ్నేశ్వర పూజ, పరిషత్ పంచగవ్యప్రాసన, గోపూజ, రుద్రాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, లలిత హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జ్యోతుల నెహ్రూ మణి, జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి, తోట సర్వారాయుడు, సునీత దంపతులు పీటలపై కూర్చుని వైద్యనాదేశ్వర స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్థివ లింగం మహారుద్రాభిషేకంలో పాల్గొన్న శ్రీ విజయ రాజరాజేశ్వరి శ్రీ విద్యా పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వాసుదేవానందగిరి స్వాములు, శ్రీ విద్యాపీఠం పెదపులిపాక విజయవాడకు చెందిన పరమహంస పరివ్రాజకాచార్య హాజరై మహారుద్రాభిషేకంలో పాల్గొన్నారు. స్పెషల్ పోలీస్ ఎస్పీ కొండ నరసింహారావు , అతివేలు మంగాదేవి దంపతులు శంఖారావంతో భక్తులను ఆకట్టుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డొక్కా సీతమ్మ మనవడు డొక్కా నాథ్‌బాబు, గోకవరం మండలం మాజీ ఎంపీపీ డీవీ సూర్యనారాయణ, కొత్త కొండబాబు, జీను మణిబాబు, అడబాల వెంకటేశ్వరరావు, సుంకవిల్లి రాజు, బదిరెడ్డి అచ్చన్నదొర, దాసరి సీతారామకృష్ణ, అడబాల భాస్కరరావు, మలిరెడ్డి సిరి, వేముల కొండ జోగారావు, యల్లమిల్లి సీఎం, వేలాదిగా భక్తులు పాల్గొని స్వామి వారి దర్శనం చేసుకున్నారు.



హోమంలో పాల్గొన్న జ్యోతుల నెహ్రూ కుటుంబ సభ్యులు

గుంతల రోడ్డుపై ప్రయాణం నరకం

- అధ్వానంగా రాజమండ్రి-భద్రాచలం రహదారి
- నిత్యం ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- కీలకమైన రహదారికి మరమ్మతులు చేయకుండా గాలికొదిలేసిన వైనం

మోతుగూడెం, మార్చి 5: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న తులసిపాక వ్యూ పాయింట్ ఘాటీ నుంచి కనకదుర్గమ్మ ఆలయం వరకు రోడ్డు గుంతలతో అధ్వాన్నంగా ఉన్నాయి. రాజమండ్రి కాకినాడ వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏజెన్సీ పర్యటనకు వచ్చిన వారు ఈ రోడ్డును చూసి భయభ్రాంతులకు గురవుతున్నారు. అసలే ఘాటీ. రోడ్డు గుంతల వల్ల వాహనాలు ఆగిపోతే పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు. ఈ గోతుల్లో పడి వాహనదారులు పలు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో ప్రయాణించాలంటే ప్రాణాలు గుప్పెట్లోనే పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. ఈ మార్గంలో కాకినాడ భద్రాచలం, రాజమండ్రి భద్రాచలం ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ మార్గం గుండా సరిహద్దు రాష్ట్రాలైన తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిసాలోని వివిధ ప్రాంతాలకు పలు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా ఒక్కో సమయంలో వాహనాలు నిలిచిపోతున్నాయి. రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ఈ మార్గంలో మెరుగైన వైద్యం కోసం డొంకరాయి, చింతూరు నుంచి కాకినాడ వెళ్లాలంటే అంబులెన్స్ డ్రైవర్లు హడలిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ రహదారికి మరమ్మతులు చేయాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న రోడ్డు

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళం అందిస్తున్న దాతలు

అయినవిల్లి, మార్చి 5: పి.గన్నవరం మండలం వాడ్రేవుపల్లికి చెందిన పట్నాల దత్తాత్రేయ దంపతులు మంగళవారం అయినవిల్లి శ్రీ విఘ్నేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నిత్యాన్నదాన పథకానికి రూ.1,11,116 విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబుకు అందజేశారు. దాతలకు అర్చకులు వేద ఆశీర్వచనం అందించి శేష వస్త్రంతో సత్కరించగా చైర్మన్ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేసి అభినందించారు.

చోరీలకు పాల్పడుతున్నారని..

పిఠాపురంలో ముగ్గురికి దేహశుద్ధి

పిఠాపురం, మార్చి 5: చోరీలకు పాల్పడుతూ స్థానికుల చేతికి చిక్కారు ముగ్గురు వ్యక్తులు. కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని కుంతీమాధవస్వామి దేవస్థానంలో పనిచేసే దుర్గ అనే మహిళ ఇంట్లోకి ముగ్గురు వ్యక్తులు ప్రవేశించి దొంగతనానికి ప్రయత్నించారు. ఇది గమనించిన స్థానికులు వారిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. పోలీసులు వారిని విచారిస్తున్నారు. వీరు పట్టణానికి చెందిన వ్యక్తులా లేక ఇతర ప్రాంతాలకు చెందిన వారా అని ఆరా తీస్తున్నారు.

షోరూంలో అగ్నిప్రమాదం



అమలాపురం టౌన్, మార్చి 5: అమలాపురం కళాశాల రోడ్డులోని గోఖలే సెంటర్లో వాసంశెట్టి మణిశంకర్‌కు చెందిన బెలూన్స్ అన్ లిమిటెడ్ షోరూంలో మంగళవారం సాయంత్రం అగ్ని ప్రమాదం సంభవించింది. అమలాపురం అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. బెలూన్స్ డెకరేషన్ షోరూంతో పాటు గిఫ్ట్ షోరూం కూడా అగ్నికి ఆహుతయ్యింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ప్రమాదంలో రూ.8 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని అగ్నిమాపక అధికారి కేవీ మురళీ కొండబాబు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

సామర్లకోట, మార్చి 5: కాకినాడ జిల్లా సామర్లకోట తహశీల్దార్ కార్యాలయం సమీపాన రాజీవ్ గృహ కల్ప సముదాయాల వద్ద ఒక ప్లాట్‌లో సుమారు 40 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉండడాన్ని మంగళవారం సాయంత్రం స్థానికులు గుర్తించి సామర్లకోట పోలీసులకు సమాచారం అందించారు. ఇంటి తలుపులు మూసి ఉన్న ప్లాట్ నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని తలుపులు తెరిచి దర్యాప్తు ప్రారంభించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని సామర్లకోట పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాల నేపథ్యంలో ఘర్షణ

భార్య చెంపపై కొట్టిన భర్త..అక్కడికక్కడే మృతిచెందిన మహిళ



మృతిచెందిన సాయిదీపిక

కొవ్వూరు, మార్చి 5: ఘర్షణ పడే క్రమంలో భర్త.. భార్య చెంపపై గట్టిగా కొట్టడంతో మృతిచెందింది. కొవ్వూరు మండలం మద్దూరులో ఈ ఘటన జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మద్దూరుకు చెందిన సంద్ర వీరబాబుకు, అత్తిలి గ్రామానికి చెందిన లావణ్య సాయిదీపికతో 2010లో వివాహం జరిగింది. వీరికి కుమారుడు జయశంకర్, కుమార్తె కుందన ఉన్నారు. వీరబాబు తాపీ పనిచేస్తుంటాడు. మద్యం, పేకాట, కోడి పందాలకు బానిస కావడంతో భార్యాభర్తల మధ్య తరచూ డబ్బు విషయమై గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం డ్వాక్రా రుణానికి సంబంధించిన వాయిదా డబ్బు చెల్లింపు విషయంలో ఇద్దరు ఘర్షణ పడ్డారు. ఈ కొట్లాటలో కోపంతో వీరబాబు భార్య చెంపపై గట్టిగా కొట్టాడు. దీంతో మాటలేకుండా లావణ్య కిందపడి మరణించింది. జరిగిన సంఘటనను వీరబాబు అత్తిలిలో ఉన్న అత్తమామలకు ఫోనులో తెలియజేయగా వారు హుటాహుటిన మద్దూరు రావడంతో లావణ్య చనిపోయిన విషయం బయటకు వచ్చింది. కొవ్వూరు డీఎస్పీ కె.రామారావు, సీఐ వి.శ్రీనివాసరావు, రూరల్ ఎస్ఐ కె.సుధాకర్ సంఘటనా స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులు, బంధువుల నుంచి వివరాలు సేకరించారు. లావణ్య తల్లిదండ్రులు బడేటి గణపతి, వెంకటలక్ష్మి మాట్లాడుతూ వివాహం జరిగినప్పటి నుంచి తమ కుమార్తెను సరిగా చూసుకోలేదని, భర్తతోపాటు అత్త సంద్ర సూర్యకుమారి బాధలు పెడుతూనే ఉన్నారని, అన్యాయంగా తమ కుమార్తెను చంపేశారని ఆరోపించారు. తండ్రి ఫిర్యాదు మేరకు భర్త, అత్తపై హత్య కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

భర్తపై కోపంతో ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నం

రక్షించి కౌన్సిలింగ్ ఇచ్చిన పోలీసులు

సామర్లకోట, మార్చి 5: కుటుంబ కలహాలు, భర్తపై కోపంతో కాకినాడ జిల్లా సామర్లకోటలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకునే ప్రయత్నం చేసిన ఒక మహిళను సామర్లకోట రైల్వే పోలీసులు రక్షించారు. సామర్లకోట మండలం వీకె రాయపురం గ్రామానికి చెందిన మల్లిరెడ్డి నాగలక్ష్మి భర్త మద్యానికి బానిసై పలువురి వద్ద అప్పులు చేస్తూ జల్సాలు చేయడంతో జీవితంపై విరక్తి చెందింది. దీంతో ఆత్మహత్య చేసుకునేందుకు సామర్లకోట రైల్వే స్టేషన్‌కు తన కుమార్తెతో సహా చేరుకుని పట్టాల వద్ద ఉండడాన్ని గమనించిన పల్స్ పోలియో సిబ్బంది సామర్లకోట రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రైల్వే పోలీసులు హుటాహుటిన స్పందించారు. సంఘటనా స్థలానికి చేరుకుని నాగలక్ష్మిని, ఆమె కుమార్తెను రక్షించారు. సమాచారం తెలుసుకుని భర్త శివదుర్గను స్టేషన్‌కు రప్పించి భార్యాభర్తలిద్దరికీ పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం వారిని స్వగ్రామం అయిన వీకే రాయపురం పంపించారు.



భార్యాభర్తలకు కౌన్సిలింగ్ ఇచ్చిన పోలీసులు

అనుమానాస్పద స్థితిలో ఒడిసా యువకుడి మృతి

అమలాపురం రూరల్, మార్చి 5: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ తాండవపల్లి రొయ్యల చెరువుల వద్ద పనిచేసేందుకు వచ్చిన ఒడిసా యువకుడు సంజయ్ కాటా (23) మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఒడిసాకు చెందిన నలుగురు యువకులు గత నెల 29న తాండవపల్లిలో రొయ్యల చెరువుల వద్ద పనిచేసేందుకు వచ్చారు. వారిలో సంజయ్ కాటా స్థానిక రైతు చొప్పల వీవీ నాగేశ్వరరావు వద్ద పనికి కుదిరాడు. ఈ నెల ఒకటో తేదీన మిత్రులతో కలిసి భోజనం చేస్తూ ఇక్కడ పనిచేయలేనని, ఉండలేకపోతున్నానని ఇంటికి వెళ్లిపోతానని చెప్పాడు. భోజనం చేసిన కొన్ని గంటల తర్వాత నుంచి సంజయ్ కనిపించలేదు. 2వ తేదీన చెరువుల యజమాని ఒడిసాలోని కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి మీ అబ్బాయి ఇంటికి వచ్చారా అని ఆరా తీశారు. బిడ్డ ఇంటికి రాకపోవడంతో కంగారుపడ్డ కుటుంబ సభ్యులు తాండవపల్లి చేరుకుని ఆచూకీ కోసం వెతకడం ప్రారంభించారు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో చెరువు గట్టు పక్కన సంజయ్ మృతదేహం ఉన్నట్టు స్థానికులు గుర్తించారు. తాలూకా ఎస్ఐ కె.శేఖర్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. సంజయ్ సోదరుడు అర్జున్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

వేర్వేరు రైలు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తుల మృతి

తుని రూరల్, మార్చి 5: కాకినాడ జిల్లా తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు చోట్ల జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. తుని రైల్వేస్టేషన్‌కు దగ్గరలో లింగాలకాలనీ వద్ద రైలు పట్టాలపై మృతదేహం లభ్యమైందని, వివరాలు తెలియరాలేదని ఎస్ఐ తెలిపారు. అదే విధంగా తిమ్మాపురం రైల్వేస్టేషన్ సమీపంలో బెంగళూరు నుంచి జార్ఖండ్ వెళుతున్న గుర్తు తెలియని ప్రయాణికుడు రైలు నుంచి జారి పడటంతో తీవ్ర గాయాలపాలయ్యాడన్నారు. 108 సహాయంతో ఏరియా ఆసుపత్రికి తరలించివైద్యం అందించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రెండు ఘటనపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రిలో భద్రపరిచి బంధువులకు సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించాలి

రంపచోడవరం, మార్చి 5: మహా శివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సబ్ కలెక్టరు కార్యా లయంలో ఆయన ఏఎస్పీ జగదీష్ అడహళ్లితో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టరు మాట్లాడుతూ ఐదు రోజుల ఉత్సవాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలన్నారు. ఏఎస్పీ మాట్లాడుతూ శివాలయాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వివిధ శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది, కమిటీ సభ్యులు అందుబాటులో ఉండి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో ప్రకాశం, డీఎల్‌పీవో రాఘవన్, ఎంపీడీవో హరికృష్ణ, తహశీల్దార్లు సత్య నారాయణ, చలపతిరావు, డీటీ బి.రాజు, సీఐ వి.వెంకటేశ్వరరావు, ఎస్ఐ మోహన్‌రావు, ఆర్టీసీ డీఎం రమణ పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, ఏఎస్పీ

ఏర్పాట్లపై ఏఎస్పీ ఆరా

చింతూరు, మార్చి 5: మహా శివరాత్రి వేడుకల నిర్వహణపై చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా మంగళవారం సమీక్ష నిర్వహించారు. వీరాపురం శివలింగం వద్దకు ప్రతి ఏటా ఛత్తీస్‌గఢ్, ఒడిసా, తెలంగాణ నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. దీంతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని శివరాత్రి వేడుకల నిర్వహణ కమిటీకి సూచించారు. కార్యక్రమంలో సీఐ గజేంద్రకుమార్, ఎస్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏజెన్సీ సమాచారం

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ విజయసునీత



సదుపాయాలపై ఆరా తీస్తున్న కలెక్టర్ విజయసునీత

చింతూరు, మార్చి 5: అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ విజయ సునీత మంగళవారం చింతూరు మండలంలో పర్యటించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాన్ని ఆనుకొని ఉన్న చిడుమూరు, చింతూరు, తులసిపాకల, చట్టి పాఠశాలలను సందర్శించి సదుపాయాల కల్పనపై పలు సూచనలు చేశారు. ఓటర్లకు ఎట్టి పరిస్థితుల్లో అసౌకర్యం కలగకూడదని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

చట్టి పాఠశాలలో విద్యార్థుల కోసం తయారు చేస్తున్న వంటలను కలెక్టర్ విజయసునీత పరిశీలించారు. అనంతరం వంట కార్మికులతో మాట్లాడారు. పరిశుభ్రంగా, రుచికరంగా వంటలను తయారు చేయాలని కలెక్టర్ సూచించారు.

విద్యార్థులకు ప్రశ్నలు

వివిధ పాఠశాలలను సందర్శించిన కలెక్టర్ ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలపై ప్రశ్నించి జవాబులు రాబట్టారు. ఉన్నతోద్యోగం పొందడానికి సత్ప్రవర్తన, ప్రణాళికాబద్ధమైన చదువు అవసరమని విద్యార్థులు ఆ దిశగా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. చింతూరు జిల్లా పరిషత్ పాఠశాలలో మన విశ్వం అనే పాఠాన్ని కలెక్టర్ కొద్దిసేపు బోధించారు. కలెక్టర్ వెంట చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య, ఎంఈవో-1 లక్ష్మీనారాయణ ఉన్నారు.

లారీ అసోసియేషన్ దీక్షకు టీడీపీ మద్దతు

చింతూరు, మార్చి 5 : కలప తరలింపు విషయంలో తమకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తూ చింతూరు లారీ యూనియన్ ఓనర్స్ చేస్తున్న దీక్ష రెండో రోజుకు చేరుకుంది. చింతూరు టీడీపీ నాయకులు దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు ఇళ్ల చిన్నారెడ్డి మాట్లాడుతూ స్థానికంగా ఉన్న లారీలను అటవీ శాఖ వినియోగించుకుంటే స్థానికులకు ఉపాధి కల్పించినట్లవుతుందన్నారు. కొంత మంది టెండరు దారులు మరికొంతమంది అటవీ అధికారులు తీసుకుంటున్న స్వార్థపరమైన నిర్ణయాల కారణంగా స్థానికులకు ఉపాధి లేకుండా పోతోందన్నారు. ఈ విషయంలో అటవీ శాఖ ఉన్నతాధికారులు స్పందించి లారీ ఓనర్స్ వర్కర్లకు న్యాయం చేయాలని చిన్నారెడ్డి కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వరరావు, సాల్మన్‌రాజు, తుర్రం చిన్నముత్తయ్య, శీలం తమ్మయ్య, తుర్రం సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సూరజ్‌గనోరే

రంపచోడవరం, మార్చి 3: ఏజెన్సీలో బాల్య వివాహాలు నిర్మూలించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అన్నారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన తర్వాతే అమ్మాయిలకు పెళ్లిళ్లు చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. గ్రామాల్లో బాల్య వివాహాలు చేస్తే ఐసీడీఎస్, పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి, వెలుగు ఏపీడీ శ్రీనివాసరావు, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి కోటేశ్వరరావు, ఏడీఎంహెచ్‌వో జి.ప్రకాశం, సీడీపీవోలు సంధ్యారాణి, ప్రసన్నలక్ష్మి, లక్ష్మి, సుధా, దేవమణి పాల్గొన్నారు.

కేంద్రం పథకంతో ప్రయోజనాలు

మారేడుమిల్లి, మార్చి 5: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాజమహేంద్రవరం సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టల్ అధికారి పి.కోమల్‌కుమార్ కోరారు. విలేఖరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ పథకంలో లబ్ధి పొందాలనుకునేవారు తమ పేర్లను సమీప తపాల కార్యాలయాల్లో నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పటికే పోస్టల్ శాఖ సర్వే నిర్వహిస్తోందని చెప్పారు. ప్రతి ఇంటికి 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తుందని, 150 యూనిట్లు వినియోగానికి ఒక కిలో వాట్స్ సామర్థ్యం గల సోలార్ ప్యానల్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. ఇందుకు రూ.55 వేలు నుంచి రూ.65 వేల వరకు వ్యయం అవుతుందన్నారు. ఒక కిలో వాట్స్‌కి కేంద్ర ప్రభుత్వం రూ.30 వేలు వరకు రాయితీ కల్పిస్తుందన్నారు. సొంత ఇల్లు ఉన్న వారు ఈ పథకానికి అర్హులన్నారు. ఈ పథకం కింద 3 కిలో వాట్స్ వరకు సబ్సిడీ లభిస్తుందన్నారు. రిజిస్ట్రేషన్ కోసం మొబైల్ నెంబరు, గత నెల విద్యుత్ బిల్లు ఉండాలన్నారు. పూర్తి వివరాలకు రంపచోడవరం డివిజన్ ఎంవో ఈశ్వర్ 9000580560, 9642431898 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

నిర్వాసితులకు ఏం చేశారు?

ఓట్ల కోసం మోసం చేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ: టీడీపీ కమిటీ

వరరామచంద్రాపురం, మార్చి 5: పోలవరం నిర్వాసితులకు ఇచ్చిన హామీలు ఏమి నెరవేర్చారని ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్ రోడ్‌షోలు చేస్తున్నారని టీడీపీ మండల కమిటీ ప్రశ్నించింది. టీడీపీ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు వాళ్ల రంగారెడ్డి, తెలుగు యువత ఆర్గనైజింగ్ కార్యదర్శి బొర్ర న రేష్‌కుమార్ మాట్లాడుతూ రూ.లక్షా పదిహేను వేలు పరిహారం తీసుకున్న భూములకు ఐదు లక్షలు ఇస్తానని హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. జీవో నంబరు 3ను సుప్రీంకోర్టులో కొట్టివేస్తే కనీసం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పిటిషన్ కూడా వేయలేదని ప్రశ్నించారు. అన్నవరం బ్రిడ్జి కూలిపోయి 4 సంవత్సరాలు అయినా, దానిని నిర్మించలేక తాత్కాలిక బ్రిడ్జి నిర్మాణం చేసి చేతులు దులుపుకున్నారన్నారు. ఇప్పుడు ఎన్నికల కోడ్ సమయంలో ఓట్ల కోసం ప్రజలను మోసం చేస్తూ శంకుస్థాపనలు చేస్తున్నారన్నారు. మండల అధ్యక్షుడు ఆచంటి శ్రీను, కార్యదర్శి బురకా కన్నారావు, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు బీరక సూర్యప్రకాష్‌రావు, ఐటీడీపీ కన్వీనర్ ముత్యాల సిద్ధు, ముత్యాల చంద్రశేఖర్, కారం శిరమయ్య, తెల్లం అప్పారావు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ఎటపాక, ఫిబ్రవరి 5: 141 సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎటపాక నవోదయ విద్యాలయంలో క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని పాఠశాలలు, జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో ఈ పోటీలు నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్‌లో ఎటపాక జీఎంఆర్ కళాశాల జట్టు, నెల్లిపాక జడ్పీ ఉన్నత పాఠశాలల జట్లు తలపడ్డాయి. నెల్లిపాక జట్టు విజేతగా నిలిచింది. టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో 141 సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ కమాండెంట్ రితేష్ ఠాకూర్ విజేత జట్లకు ట్రోఫీ, బహుమతులు, క్రికెట్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో 141 బెటాలియన్ సెకండ్ కమాండెంట్ కమల్వీర్ యాదవ్, 141 బెటాలియన్ సెకండ్ కమాండెంట్ ప్రీత, నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ లక్ష్మీరాజ్యం, అధికారులు పాల్గొన్నారు.

నేడు సీతారామ కథాసుధ గ్రంథావిష్కరణ

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 5: తాను రచించిన వాల్మీకి మహర్షి విరచిత శ్రీమద్రామాయణంలోని ఆరో భాగం సీతారామ కథాసుధ పేరుతో యుద్ధకాండ గ్రంథావిష్కరణ ఈ నెల 6వ తేదీ సాయంత్రం ఆనంద్ రీజెన్సీ హోటల్‌లోని పందిరి ఫంక్షన్ హాల్‌లో జరుగుతుందని రచయిత, జర్నలిస్టు దీక్షితుల సుబ్రమణ్యం మంగళవారం తెలిపారు. ఈ గ్రంథాన్ని మహా మహోపాధ్యాయ శలాక రఘునాథశర్మ, సినీ రచయిత మరుధూరి రాజా, సుపథ సాంస్కృతిక మాసపత్రిక ఎడిటర్ వల్లూరి విజయ హనుమంతరావు ఆవిష్కరిస్తారన్నారు.

ఉమ్మడి కూటమిని అధికారంలోకి తేవడమే లక్ష్యం

» టీడీపీ-జనసేన అభ్యర్థి ఆదిరెడ్డి వాసు, జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ



పార్టీలోకి చేరిన కార్యకర్తలతో ఆదిరెడ్డి వాసు, అనుశ్రీ

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 5: రాష్ట్ర భవిష్యత్తు, మన బిడ్డల భవిష్యత్తు కోసం టీడీపీ-జనసేన ఉమ్మడి కూటమిని ఎన్నికల్లో అధికారంలోకి తీసుకురావడమే ఉమ్మడి లక్ష్యమని టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన రాజమహేంద్రవరం ఇన్‌చార్జీ అనుశ్రీ సత్యనారాయణ అన్నారు. రాజమహేంద్రవరం 46వ డివిజన్‌లో మంగళవారం రాత్రి జరిగిన చేరికల కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా విచ్చేసి వైసీపీ నుంచి టీడీపీ-జనసేన కూటమిలోకి చేరిన 150 మంది కార్యకర్తలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలకు సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. జగన్‌ను ఇంటికి పంపించి వేయాలన్నారు. కార్యక్రమంలో తెలుగు మహిళా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ తురకల నిర్మల, మండల రవికుమార్, మజ్జి రాంబాబు, అగురు ధనరాజ్, మొకమాటి సత్యనారాయణ, రమణ, సలాది ఆనంద్, లక్ష్మి పాల్గొన్నారు.

మహిళా సాధికారత టీడీపీతోనే సాధ్యం: రామకృష్ణారెడ్డి

అనపర్తి, మార్చి 5: మహిళా సాధికారత టీడీపీతోనే సాధ్యపడుతుందని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మినీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలతో బాటు మహాశక్తి ద్వారా మహిళలకు చేకూరే ప్రయోజనాలను వివరిస్తూ అనపర్తిలో తెలుగు మహిళలు ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మహాశక్తి పథకాలను వివరించారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేం దుకు గతంలో టీడీపీ ప్రభుత్వాలు అనేక పథకాలను ప్రవేశపెట్టాయని రామకృష్ణారెడ్డి గుర్తుచేశారు. కార్యక్రమంలో తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు జుత్తుగ సూర్యకుమారి, పోతంశెట్టి సూర్యకుమారి, వేణమ్మ, కొవ్వూరి పార్వతి, సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, బాసి పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేశ్‌పై కేసుల వివరాలివ్వండి

2019 నుంచి తూర్పుగోదావరి జిల్లాలో టీడీపీ అధినేత చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌లపై పోలీసులు నమోదు చేసిన కేసుల వివరాలను తెలపాలని కోరుతూ మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ జగదీష్‌కు రామకృష్ణారెడ్డి లేఖను అందజేశారు. ఈ విషయాన్ని స్థానిక విలేకరులకు తెలియజేశారు.



అనపర్తిలో సూపర్ సిక్స్ పథకాలను ప్రచారం చేస్తున్న రామకృష్ణారెడ్డి

ఐకమత్యంతో టీడీపీ-జనసేన విజయానికి కృషి

ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

కడియం, మార్చి 5: టీడీపీ-జనసేన ఎమ్మెల్యే అభ్యర్థుల విజయానికి రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో కృషి చేయాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని జనసేన నాయకులను కలిసి ఐకమత్యంతో ముందుకెళదామని పిలుపునివ్వగా అభ్యర్థుల విజయానికి సహకారం అందిస్తామని వారు అన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, అన్నందేవుల చంటి, మార్గాని సత్యనారాయణ, వెలుగుబంటి నాని, బోడపాటి గోపి తదితరులున్నారు.

మధునాపంతులు జయంతి

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 5: తెలుగువారి చరిత్రను ఛందోమధురంగా తీర్చిదిద్ది ఆంధ్ర పురాణం మనకు అందించిన మహాకవి మధునాపంతుల అని సాహితీవేత్త డాక్టర్ సుంకరగోపాల్ అన్నారు. మంగళవారం గౌతమీ లైబ్రరీలో మధునాపంతుల ట్రస్టు అధ్వర్యంలో జరిగిన కళాప్రపూర్ణ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి 104వ జయంతి సభలో ఆయన మాట్లాడారు. శాతవాహనుల నుంచి నాయకరాజుల వరకూ మన చరిత్ర ఎలా పరిఢవిల్లిందో ఆంధ్ర పురాణం రమ్యమైన పద్యాలతో వివరిస్తోందన్నారు. డాక్టర్ అరిపిరాల నారాయణరావు అధ్యక్షత జరిగిన ఈ సభలో వక్త గోపాల్‌ను రెంటాల శ్రీవెంకటేశ్వరరావు, బులుసు వేంకట సత్యనారాయణ మూర్తి సత్కరించారు. కార్యక్రమంలో కవి రత్నరాజు, సీనియర్ పాత్రికే యుడు ముత్యం రమేష్, చాగంటి నరసింహమూర్తి, ఎస్ఎస్ ప్రసాద్, దినవహి బాపిరాజు, ఎస్.సూరిబాబు పాల్గొన్నారు.

రాజానగరంలో నాడు-నేడు పనుల పరిశీలన

అసంతృప్తి వ్యక్తం చేసిన డిప్యూటీ డీఈవో



రాజానగరం హైస్కూల్లో చేపట్టిన పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో నారాయణ

రాజానగరం, మార్చి 5: నాడు నేడు పథకంలో భాగంగా రాజానగరం హైస్కూల్లో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనుల జాప్యంపై డిప్యూటీ డీఈవో ఈవీఎస్ఎస్ ఎస్ బీఎల్ నారాయణ పరిశీలించి అసం తృప్తి వ్యక్తంచేశారు. నాడు-నేడు ఫేజ్-2లో భాగంగా మంజూరైన అదనపు తరగతి గదులు పరిశీలించిన ఆయన నేటికీ కూడా పనులు పూర్తి చేయకపోవడంపై అసంతృప్తి చెందారు. అనంతరం 8,9 తరగతుల విద్యార్థులను ప్రశ్నించి, సిలబస్ ప్రకారం పాఠ్యాంశాల బోధన, నోట్ బుక్ కరెక్షన్స్‌ను సకాలంలో పూర్తి చేయాలని, ఈ విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. పదో తరగతి పరీక్షలకు ఉపయోగపడేలా తక్షణమే పూర్తి చేయాలని హెచ్‌ఎం నాగమణి, ఎంఈవో రామన్నదొరకు సూచించారు.

మల్లంపూడిలో టైలరింగ్‌పై ఉచిత శిక్షణ

రాజానగరం, మార్చి 5: మండలంలోని మల్లంపూడిలో సుంకర వినయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్‌పై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించినట్టు ఫౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వరరావు తెలిపారు. ఇంట్లో పిల్లలను ఆడ, మగ అనే తేడా లేకుండా సమభావనతో పెంచితే చిన్ననాటి నుంచి సమాజంలో మంచి చెడులను గ్రహిస్తారన్నారు. కార్యక్రమంలో శిక్షకురాలు ఈపూరి దుర్గ, కుమారి, నాగమణి, మీనా హాజరయ్యారు.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం

రాజానగరం, మార్చి 5: ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత శక్తివంతమైన సాధనం ఓటు అని గైట్ కళాశాల ప్రొఫెసర్ ఎంవీ సుబ్బారావు అన్నారు. గైట్ అటానమస్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నూతన ఓటర్లకు మొదటి ఓటు అనే అంశంపై మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఓటు ప్రాధాన్యతను వివరించారు. ప్రతి ఓటరు తప్పక ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీవో వైడీ శివప్రసాద్ తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

దివాన్‌చెరువు, మార్చి 5: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే మెరుగైన ఆరోగ్యం సాధ్యమని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రామ్ అధికారి ఎస్.రాజ్యలక్ష్మి అన్నారు. నన్నయ వర్శిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్-1 దివాన్‌చెరువులో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా మంగళవారం స్థానిక ఎంపీఈఎస్-2 మైదానంలోనూ, ఆ పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. చెత్తను సేకరించి పంచాయతీ సిబ్బందికి అందించారు.

'రెచ్చగొట్టేందుకే సిద్ధం సభ'

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 5: ఎంపీ మార్గాని భరత్‌రామ్ నగరంలో హుందాగా సాగే రాజకీయ వాతావరణాన్ని రెచ్చగొట్టేందుకే సిద్ధం సభ పెట్టి దిగజారి మాట్లాడారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో అన్నారు. కొడాలి నాని, పేర్ని నానిలను రాజమహేంద్రవరం రప్పించి సభలు పెట్టినా టీడీపీ, జనసేన నేతలను చులకనగా మాట్లాడినా చేసేదేమిలేదని, జగన్ పార్టీ పునాదులు కదులుతున్నాయన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం బాగుపడుతుందన్నారు.

డాక్టరుపై దాడి.. కేసు నమోదు

రాజమహేంద్రవరం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): డాక్టరుపై అర్ధరాత్రి దాడి చేసి గాయపరచిన ఘటనపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. గోకవరం పీహెచ్‌సీలో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ బి.రవికుమార్ రాజమహేంద్రవరంలో నివాసం ఉంటున్నారు. ఆదివారం అర్ధరాత్రి ఆయన కారులో వస్తుండగా ప్రభుత్వాసుపత్రి వద్ద ఇద్దరు వ్యక్తులతో వాగ్వాదం జరిగింది. ఆయనపై ఈ ఇద్దరూ దాడి చేసి కొట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, నిందితుల గురించి గాలిస్తున్నామని సీఐ వీరయ్యగౌడ్ తెలిపారు. సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలిస్తున్నామన్నారు. అయితే, దుండగులతోపాటు వైద్యుడు కూడా మద్యం మత్తులో ఉన్నారని సమాచారం.

అడ్మిషన్లపై అస్పష్టతతో ఆందోళన

దివాన్‌చెరువు, మార్చి 5: విద్యాసంవత్సరం-2024-25కి సంబంధించి ఆర్‌టీఈ12(1)(సి) ప్రవేశాలకు ప్రారంభానికి సంబంధించి ప్రభుత్వ విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఇంతవరకూ ఏవిధమైన ప్రభుత్వ సర్క్యులర్ ఉంచలేదని విద్యార్థుల తల్లిదండ్రుల ప్రతినిధి కొమ్ము సత్తిబాబు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో ఉచిత సీట్ల కోసం ఎదురుచూస్తున్న వేలాది తల్లిదండ్రులు నిరాశకు గురవుతున్నారన్నారు. మంగళవారం నుంచి ఆన్లైన్ దరఖాస్తులు ప్రారంభమవుతాయని అనేక పత్రికల్లో వార్తలు వచ్చినప్పటికీ ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఎక్కడా అడ్మిషన్ల లింక్ ప్రవేశపెట్టలేదని తెలిపారు. పేద వర్గాలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఈ ప్రవేశాలపై నెలకొన్న అస్పష్టతతో పలువురు తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారన్నారు.

సుదర్శన మహాయాగ పూజలు

కోరుకొండ, మార్చి 5: లోక కల్యాణార్థం కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో చేపట్టిన అష్టముఖ గండ బేరుండ లక్ష్మీనరసింహ సుదర్శన మహాయాగం పూజలు మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండపారాధనలు, మూడు ప్రత్యేక హోమ గుండాలు ఏర్పాటు చేసి వైకానస ఆగమ బ్రహ్మ పవన్‌కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు పూజలు చేశారు.

ఆటో కార్మికులకు భూమి కేటాయింపు

కోరుకొండ, మార్చి 5: కోరుకొండ మండలంలోని 115 మంది ఆటో కార్మికులకు ఒక్కొక్కరికి సెంటున్నర భూమి కేటాయిస్తూ ఆటోనగరం ఏర్పాటుకు మంగళవారం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా శ్రీకారం చుట్టారు. జంబుపట్నంలో దేవీ వెంకట మణిసాయి ఆటో మెకానికల్ వర్కర్ సంక్షేమ సంఘం సభ్యులకు సంబంధిత పత్రాలు అందజేశారు. గతంలో యూనియన్ చేసిన ప్రతిపాదనల మేరకు జంబుపట్నంలో ఆటోనగర్‌కు సంబంధించి నాలుగెకరాల భూమి కేటాయించామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, వుల్లి బుజ్జిబాబు, కొవ్వీడి సత్రాజు, సర్పంచ్ వుల్లి అప్పన్నదొర, నాగా సత్యనారాయణ, వుల్లి చల్లారావు, నీరుకొండ బాబ్జి పాల్గొన్నారు.

పోషకాహార కిట్‌లు పంపిణీ

బిక్కవోలు, మార్చి5: జాతీయ టీబీ నియంత్రణా కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీలో క్షయ బాధితులకు మంగళవారం పౌష్టికాహార కిట్‌లు పంపిణీ చేశారు. ఈ కిట్‌లు నిక్షయమిత్ర పవర్ గ్రిడ్ సంస్థ సమకూర్చింది. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది ఎం.ప్రభావతి, ఎం.సోమరాజు, మేరీ సుజాత, పి.కృష్ణంరాజు పాల్గొన్నారు.

సిబ్బందికి జిల్లా ఎస్పీ సత్కారం



రాజమహేంద్రవరం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): నిందితుడికి శిక్ష పడడంలో చొరవ చూపిన సిబ్బంది, అడ్వొకేట్‌ని ఎస్పీ జగదీశ్ సత్కరించారు. శాటిలైట్ సిటీకి చెందిన బోయిన ముసలయ్య తన స్నేహితుడు మంగారావును హత్య చేసిన ఘటనలో నేరం రుజువు కావడంతో ముసలయ్యకు జీవిత ఖైదు విధించిన విషయం విదితమే. ఈ కేసులో కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టడం తదితర ప్రక్రియలో ప్రతిభ చూపిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎంఏ బాషా, బొమ్మూరు పీఎస్‌లోని కోర్టు కేసులు చూసే హెడ్‌కానిస్టేబుల్ పి.వెంకటరమణను ఎస్పీ సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. నిందితులను అరెస్టు చేయడంతోపాటు వారికి కోర్టు శిక్ష పడే విధంగా శ్రమించడం కూడా పోలీసు విధుల్లో భాగమేనని ఆయన పేర్కొన్నారు.


బీసీ హాస్టల్ విద్యార్థి దొరికాడు..

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 6: రెండు వారాల క్రితం రాజమహేంద్రవరంలోని ఓ బీసీ బాలుర హాస్టల్ నుంచి పరారైన టెన్త్ విద్యార్థి రెండు రోజుల క్రితం పోలీసులకు దొరకడంతో అతడిని తల్లిదండ్రులకు అప్పగించారు. బీసీ బాలుర హాస్టల్‌లో టెన్త్ చదువుతున్న ఆ విద్యార్థి అదే హాస్టల్‌లో 9వ తరగతి విద్యార్థికి చెందిన ట్యాబ్ తన వెంట తీసుకెళ్లిపోయాడు. ట్యాబ్ సిగ్నల్స్‌ను ట్రేస్ చేసిన పోలీసులు అతన్ని పట్టుకుని హాస్టల్ వెల్ఫేర్ అధికారులకు అప్పగించారు. కాగా, పదిరోజుల క్రితం కనబడకుండా పోయిన ఎస్సీ బాలుర హాస్టల్ విద్యార్థి కోసం పోలీసులు, హాస్టల్ అధికారులు గాలిస్తున్నారు. అతడి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నా జాడ తెలియలేదు.

8న వ్యాపార సంస్థలకు సెలవు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 5: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ది ఆంధ్రప్రదేశ్ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం ప్రకారం ఈనెల 8న వ్యాపార సంస్థలకు సెలవు దినంగా ప్రకటించినట్టు ఛాంబర్ గౌరవ కార్యదర్శి మద్దుల మురళీకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. వ్యాపారస్తులందరూ శుక్రవారం తమ తమ షాపులను మూసివేయాల్సిందిగా ఆయన కోరారు.

రైతులకు వ్యవసాయ సలహాలు అందిస్తాం



జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ నరసింహారావు

దివాన్‌చెరువు, మార్చి 5: జిల్లాలోని రైతులకు సమయానుకూలంగా వ్యవసాయ సలహాలను, సాంకేతిక పరిజ్ఞానం అందిస్తామని జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆదేశాల మేరకు ఇటీవలె జిల్లా కోఆర్డినేటర్‌గా బాధ్యతలు చేపట్టానని చెప్పారు. ఇంతవరకూ కాకినాడ ఏరువాక కేంద్రం సమన్వయకర్తగా పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. జిల్లా ఏరువాక కేంద్రాన్ని స్థానికంగానే ఏర్పాటుచేసి రైతులకు సేవలందించ నున్నట్టు చెప్పారు. రైతుల పంటల దిగుబడి పెంచేలా చేయూతనిస్తామని నరసింహారావు తెలిపారు.

ఎన్నికల్లో నిర్భయంగా ఓటేయండి

ధవళేశ్వరంలో సీఐఎస్ఎఫ్ జవాన్ల కవాతు



కవాతు నిర్వహిస్తున్న సీఐఎస్ఎఫ్

ధవళేశ్వరం, మార్చి 5: ఎన్నికల నేపథ్యంలో ఓటర్లు ధైర్యంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని, మీకు అండగా మేమున్నామంటూ సీఐఎస్ఎఫ్ జవాన్లు కవాతు నిర్వహించారు. మంగళవారం సాయంత్రం ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధిలో దక్షిణ మండలి డీఎస్పీ అంబికా ప్రసాద్ పర్యవేక్షణలో సీఐఎస్ఎఫ్ జవాన్లు, స్థానిక పోలీసులు కవాతు జరిపారు. జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్ స్థానికులతో మాట్లాడుతూ ఎన్నికలలో నిర్భయంగా ఓటు వేయాలని, మీకు అండగా మేముంటామని భరోసా కల్పించారు. అనంతరం జెండా ఊపి కవాతు ప్రారంభించారు. ఐవోసీఎల్ కాలనీ నుంచి ప్రారంభమైన కవాతు ప్రధానరహదారి, జాలరిపేట, ఒడపేట, కంచర్లైన్, యర్రకొండ, తదితర సమస్యాత్మక ప్రాంతాల మీదుగా కొనసాగింది.

మహిళా ప్రముఖులకు సత్కారం

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 5: మహిళా దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ఆనంద్ గార్డెన్స్‌లో వాకర్స్ యోగా లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సమాజానికి సేవలందించిన మహిళా ప్రముఖులను ఘనంగా సత్కరించారు. మంగళవారం క్లబ్ వ్యవస్థాపకుడు పామర్తి గోపాలరావు, కార్యదర్శి గుబ్బల గంగాభవాని పర్యవేక్షణలో అధ్యక్షుడు శనపతి సత్తిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కందుకూరి వీరేశలింగం, రాజ్యలక్ష్మి దంపతుల చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. యోగా గురువు ఆశపు బాబాజీ దంపతులను సత్కరించారు. వారి సహకారంతో వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అలాగే మాజీ మేయర్ ఆదిరెడ్డి వీరరాఘవమ్మ, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు పి.లక్ష్మి, పూర్వ అధ్యక్షురాలు కె.రుక్మిణి, ఉపాధ్యాయురాలు డీఎన్ కళావతి, సమాజ సేవకురాలు మేడపాటి సాయిలను ఆదర్శ మహిళామణి పురస్కారాలతో సత్కరించారు. అనంతరం వృద్ధులకు పించన్లు అందించారు. కార్యక్రమంలో రాళ్ళబండి సత్యవాణి, కె.ధనలక్ష్మి, భేరి రత్నాంబ, కొత్తపల్లి గీత, లంకే శ్రీదేవి, సూరపురెడ్డి తాతారావు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

బిక్కవోలు, మార్చి 5: కొంకదురు గ్రామంలో పదో తరగతి చదువుతున్న 40 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. 2008-09 బ్యాచ్ పదో తరగతి విద్యార్థి ఇమ్మంది పూర్ణకుమార్ జ్ఞాపకార్థం వారి స్నేహితుల బృందం పూర్ణ ఫౌండేషన్ పేరుతో ఈ సేవా కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎంఈవో-2 పూర్ణచంద్రరావు, హెచ్‌ఎం మల్లిపూడి శ్రీనివాస్, ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయాల కమిటీలతో డీఎస్పీ సమావేశం



కడియం, మార్చి 5: శివ రాత్రి ఉత్సవాల సందర్భంగా కడియపులంకలోని హరిహర మహాక్షేత్రం, ఆంజనేయ స్వామి ఆలయాల కమిటీలతో మంగళవారం దక్షిణమండల డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ సమావేశం నిర్వహించారు. అంతకుముందు అన్నదానం జరిగే ప్రాంతం, ఊరేగింపు రూట్లు, వాహనాల పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. ఆలయ కమిటీ, నర్సరీరైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఐ బి.తులసీధర్, ఎస్ఐ టి.కృష్ణసాయి, సర్పంచ్-ఇన్‌చార్జి పాటంశెట్టి రామ్‌జీ, మార్గాని సత్యనారాయణ, పల్ల సుబ్రహ్మణ్యం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దేవదాయ భూములన్నీ రామకృష్ణ మిషన్ పరిధిలోకి తెవాలి

ఎస్ఎస్ఎన్‌పీ అధ్యక్షుడు సుందరానంద్ పండిట్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 5: రాష్ట్రంలోని దేవదాయ భూములన్నీ రామకృష్ణ మిషన్ పరిధిలోకి తీసుకురావాలని సజ్జన సంగమ నేషనల్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ సుందరానంద పండింట్ డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులోని తన నివాసంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవదాయ భూములను రామకృష్ణ మిషన్ పరిధిలోకి తీసుకురావాలని సుప్రీంకోర్టు గతంలో చెప్పిందని, కాని పాలకులు దానిపై దృష్టి పెట్టలేదన్నారు. భూములు రామకృష్ణ మిషన్ పరిధిలోకి వస్తే వాటి ద్వారా వచ్చే ఆదాయంతో ప్రభుత్వాల కంటే మెరుగైన సేవలు ప్రజలకు అందుతాయన్నారు. మెరుగైన విద్య, ఉద్యోగవకాశాలు, కల్పించడం, కళలను ప్రోత్సహించడం, తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికి 50 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి అనేక పథకాలతో మేనిఫెస్టో రూపొందించామన్నారు. ఎన్నికల సంఘం గుర్తింపు ప్రక్రియలో తమ పార్టీ ఉన్నందున స్వతంత్ర అభ్యర్థులుగా పోటీకి దిగేవారికి తమ మద్దతు ఉంటుందన్నారు.

మొబైల్ టీంతో పోలియో చుక్కలు

సీతానగరం, మార్చి 5 ఈ నెల 3న పల్స్‌పోలియో పూర్తిచేసిన వైద్య సిబ్బంది మంగళవారం హైరిస్క్ ప్రాంతాల్లో మొబైల్ టీం ద్వారా పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య, ఎంపీహెచ్‌వో వై.సుబ్బారాయుడు మాట్లాడుతూ బయటి ప్రాంతాల నుంచి వలస వచ్చిన, ఇటుక బట్టీల వద్ద ఉన్న, ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారులకు మంగళవారం పోలియో చుక్కలు వేశామన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
బుధవారం 6 మార్చి 2024 | 3



నేడు దేవరపల్లి పొగాకు కేంద్రం ప్రారంభం

ఐకమత్యంతో టీడీపీ-జనసేన విజయానికి కృషి : గోరంట్ల

స్వర్ణయుగమే

- టీడీపీ, జనసేన ఉమ్మడి బీసీ డిక్లరేషన్‌తో బీసీలకు మళ్లీ మంచిరోజులు
- వైసీపీ పాలనలో నలిగిపోయి చితికిపోయిన బీసీల్లో ఆనందోత్సాహాలు
- తిరిగి ఆదరణ పథకం ప్రారంభిస్తామన్న డిక్లరేషన్ ప్రకటనతో భరోసా
- రూ.4 వేలకు పెన్షన్ పెంపు, ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామనడంతో ఉత్సాహం
- బీసీ భవనాలు, కమ్యునిటీ హాళ్లు ఏడాదిలో పూర్తి చేస్తామనడంతో మళ్లీ పునరుజ్జీవం
- 1986 తర్వాత నుంచీ జరగని బీసీల కులగణనను చట్టబద్ధంగా చేస్తామని హామీ
- జిల్లాలో వైసీపీ ఐదేళ్ల పాలనలో అన్ని బీసీ పథకాలు రద్దు
- పథకాలు తీసేసి మొక్కుబడిగా జిల్లాలో 13,314మందికి మాత్రమే చేయూత

మాట్లాడితే నా బీసీ.. నా బీసీ... అంటూ ఇన్నాళ్లు వారిని నిలువునా మోసం చేసిన జగన్ సర్కారుకు టీడీపీ, జనసేన కూటమి గట్టి షాక్ ఇచ్చింది. ఉమ్మడి డిక్లరేషన్ ప్రకటనతో వైసీపీ పాలనలో నలిగిపోయిన బీసీలకు సాంత్వన చేకూర్చేలా కీలక నిర్ణయాలు ప్రకటించింది. బీసీలను కేవలం ఓట్ల కోసమే వాడుకుని వారిని ఐదేళ్లుగా అణగదొక్కిన జగన్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేలా డిక్లరేషన్ ఆయుధాన్ని బయటకు వదిలింది. అధికారం చేతిలో ఉన్నా ఏదీ చేయకుండా బీసీలను మోసం చేసిన తీరును ఎండగట్టింది. తిరిగి అధికారంలోకి వచ్చాక పూర్వవైభవం తీసుకువస్తామని ఎలుగెత్తి చాటింది.



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

వైసీపీ అటకెక్కించి కక్షతో రద్దుచేసిన అనేక కీలక సంక్షేమ పథకాలను తిరిగి అమలుచేస్తామని చెప్పి జిల్లాలో బీసీల్లో టీడీపీ, జనసేన కూటమి ధైర్యం నింపింది. మళ్లీ మునుపటి స్వర్ణయుగాన్ని తెస్తామని చాటింది. ఆదరణ, బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం, కుల గుణన, స్థానిక సంస్థలు, నామినేటెడ్ పోస్టుల్లో రిజర్వేషన్లు, బీసీ భవనాల నిర్మాణం ఇలా అనేక కీలక అంశాలపై తన అజెండా ప్రకటించింది. కాగా వైసీపీ అధికారంలోకి వచ్చాక బీసీలపై కక్షతో ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఆదరణ పథకం దరఖాస్తులు, సిద్ధంగా ఉన్న పనిముట్లను పక్కన పారేసింది. స్వయం ఉపాధికి ఊతమిచ్చే ఓబీ ఎంఎంఎస్, ఎంబీసీ పథకాలన్నీ రద్దు చేసేసింది. విదేశీ విద్య, ఉపకార వేతనాల్లో కోత కోసేసింది. అన్నింటి స్థానంలో తూతూమంత్రంగా జగనన్న చేయూత పథకం ఒక్కటే అమలు చేసి ఏటా 13,314మందికి రూ.10 వేల చొప్పున ఇచ్చి చేతులు దులిపేసుకుంది.

మళ్లీ 'ఆదరణ' అమలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1986 లెక్కల ప్రకారం.. 15.65లక్షల మంది బీసీలున్నారు. ఆ తర్వాతనుంచి ఇప్పటివరకు బీసీలకు సంబంధించి కులగణన జరగలేదు. దీంతో అన్నింటా సంక్షేమ పథకాలు, ఇతర రిజర్వేషన్లలో వీరంతా అన్యాయానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో బీసీలకు వెన్నుముకగా పేరొందిన టీడీపీ తాజాగా బీసీ డిక్లరేషన్ ప్రకటించడంతో జిల్లాలో బీసీలకు తిరిగి ఊపిరం దినట్టయింది. ప్రస్తుత లెక్కల ప్రకారం అంచనాగా చూసినా ఉమ్మడి జిల్లాలో 19 లక్షల 80 వేల మంది బీసీలు ఉంటారని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ, జనసేన ప్రభుత్వం రాగానే చట్టబద్ధంగా కులగణన చేపడతామని ప్రకటించడంతో ఇన్నేళ్ల సమస్యకు పరిష్కారం దొరుకుతుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.5వేలకోట్లతో ఆదరణ పథకం ప్రారంభిస్తామని ప్రకటించడంతో తిరిగి బీసీల్లో ధైర్యం వచ్చినట్లయింది. గత టీడీపీ ప్రభుత్వం ఆదరణ-1, ఆదరణ-2 పథకం పేరుతో జిల్లాలో బీసీల్లో ఆయా కులాలవారీగా పలు వృత్తులకు సంబంధించిన కోట్ల విలువైన లక్షలాది పనిముట్లను అందించింది. రజకుల దగ్గరనుంచి కల్లుగీత కార్మికులు, నాయీబ్రాహ్మణులు ఇలా అనేకమందికి పనిముట్లను అందించి అండగా నిలబడింది. తీరా వైసీపీ అధికారంలోకి రాగానే ఆదరణ పథకాన్ని పూర్తిగా రద్దు చేసేసింది. అప్పటికే ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వేలాదిమంది దరఖాస్తులను పక్కన పారేసింది. వీరంతా కట్టిన డబ్బులకు సంబంధించి జిల్లాకు చేరిన వేలాది కిట్లను మూలనపడేసింది. దీంతో బీసీలంతా తీవ్రంగా ఇబ్బంది పడ్డారు.

ప్రత్యేక రక్షణ చట్టంపై హర్షం

డిక్లరేషన్‌లో పేర్కొన్న విధంగా బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టంతో బీసీల్లో ఆనందం ఉప్పొంగుతోంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో జిల్లాలో అనేక రకాల దాడులు జరిగాయి. కల్లుగీత కార్మికుల దగ్గరనుంచి నాయీబ్రాహ్మణులు, రజకులపై అధికారులు, వైసీపీ నేతలు జరిపిన దాడులకు లెక్కలేదు. ఈ నేపథ్యంలో ప్రత్యేక రక్షణ చట్టంతో బీసీలకు ఊరట లభించినట్లయింది. వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన పారిశ్రామిక ప్రోత్సాహకాలు తిరిగి అమలుచేస్తామని తాజాగా టీడీపీ, జనసేన డిక్లరేషన్‌లో పేర్కొనడంతో బీసీల్లో ఆనందం వ్యక్తమవుతోంది. తిరిగి తమకు పూర్వవైభవం వస్తుందనే ధీమాను వారంతా వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి గత టీడీపీ ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో బీసీలకోసం బీసీ కార్పొరేషన్ ద్వారా ఓబీఎంఎంఎస్ పథకాన్ని అమలు చేసింది. ఏదైనా వ్యాపారం చేసుకోవాలనుకుని ముందుకు వచ్చిన లబ్ధిదారులకు రూ.లక్ష సబ్సిడీ, మరో రూ.లక్ష లోన్ అందించి ఆర్థికంగా ఎదగడానికి తోడ్పడింది. ఎంబీసీ పథకం ద్వారా రూ.30 వేలు అందించి వ్యాపారులు ప్రోత్సహించింది. జగన్ ప్రభుత్వం వచ్చాక ఇవన్నీ రద్దు చేసి పారేసింది. దీంతో ఆర్థికంగా నిలదొక్కుకుని స్వయం ఉపాధిపై నిలబడాలనుకున్న బీసీలంతా రోడ్డున పడ్డారు. బీసీ భవనాలు, కమ్యూనిటీ హాళ్లను ఏడాదిలోగా నిర్మిస్తామన్న డిక్లరేషన్ ప్రకటనతో బీసీలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కనిపించినవన్నీ కబ్జా చేసిన వైసీపీ

గత టీడీపీ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాలో బీసీలకు ప్రతి నియోజకవర్గంలో బీసీ భవనాలు, కమ్యునిటీ హాళ్లు మంజూరయ్యాయి. వీటి నిర్మాణానికి స్థలాలు, నిధులు కూడా విడుదలయ్యాయి. దోభీ ఘాట్‌ల నిర్మాణానికి కూడా రూ.లక్షల్లో నిధులు మంజూరయ్యాయి. కానీ వైసీపీ అధికారంలోకి రాగానే వీటి నిర్మాణాన్ని ఎక్కడికక్కడ నిలిపివేసింది. స్థలాలు మంజూరైన చోట వాటిని స్థానిక వైసీపీ నేతలు కబ్జా చేసేశారు. బీసీల్లో ఆయా సామాజికవర్గాల వారీగా కార్పొరేషన్లు, నిధులు, బీసీలకు నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్లు ఇస్తామని డిక్లరేషన్‌లో పొందుపరచడంతో వైసీపీ పాలనతో తాము ఎలా నలిగిపోయామో గుర్తుచేసుకుని బీసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో పేరుకు బీసీలకు కొన్ని కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా చిల్లిగవ్వ కూడా నిధులు కేటాయించలేదు. దీంతో అవన్నీ అలంకారప్రాయంగా మారాయి. ఇప్పుడు డిక్లరేషన్ ద్వారా రిజర్వేషన్ అమలు చేస్తామని టీడీపీ చెప్పడంతో ఎందరో బీసీలకు పదవులు లభించనున్నాయి. బీసీల్లో ఉన్న అనేక ఉపకులాల్లో తక్కువ జనాభా ఉన్నవారికి, ఎన్నికల్లో పోటీ చేయలేని వర్గాలకు కోఆప్షన్ సభ్యులుగా అవకాశం ఇస్తామని చెప్పడంతో వారందరికీ తొలిసారిగా గుర్తింపు లభించే అవకాశం ఏర్పడింది. టీడీపీ పాలనలో జిల్లాలో బీసీలకు ముప్పైకి పైగా పథకాలు అమల్లో ఉండేవి. కానీ బీసీలను కేవలం ఓటర్లుగానే చూసిన వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇవన్నీ రద్దు చేసేసింది. కేవలం జగనన్న చేయూత పథకం ఒక్కటే మహిళలకు అందుబాటులోకి తెచ్చింది. ఇందులోను రకరకాల కోతలు కోసి ఉమ్మడి తూ.గో. జిల్లాలో ఏడాదికి 36,177 మందికి మాత్రమే రూ.పది వేలు ఇచ్చి మమ అనిపిస్తోంది.

ఐదేళ్లుగా నష్టపోయిన వారు లక్షల్లోనే..

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 5: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బీసీలు అత్యధికంగా ఉన్నారు. ఇందులో శెట్టిబలిజలు పది లక్షల మంది ఉన్నారు. ఇందులో గీత వృత్తి సుమారు 30 వేల మంది ఉన్నారు. గతంలో గీత కార్మికులకు ఆదరణలో రెండు క్యాన్లు, ఒక సైకిల్, రూ. పది వేల నగదు వచ్చేవి. బీసీ కార్పొరేషన్ రుణాలు రూ. పది వేలు ఇచ్చేవారు. జగన్ వచ్చాక మొత్తం మూతపడ్డాయి. దురదృష్టవశాత్తూ చెట్టు పైనుంచి పడి గీతకార్మికుడు మరణిస్తే రూ. 5 లక్షల చంద్రన్న బీమా ఇచ్చేవారు. జగన్ వచ్చాక పరిహారం కింద ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. అదేవిధంగా నాయీ బ్రాహ్మణులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 30 వేల మంది ఆదరణ పథకంలో పరికరాలు తీసుకునేవారు. ఈ పథకం రద్దు కావడంతో చాలా ఇబ్బందులుపడ్డారు. జిల్లావ్యాప్తంగా పలు ఆధునిక పరికరాల వినియోగంపై శిక్షణ ఇచ్చేవారు. అదీ లేదు. కార్పొరేషన్ నిధులు లేవు. ఇటు రుణాలు రాక అవస్థలు పడుతున్నారు. అదేవిధంగా విశ్వబ్రాహ్మణులు పంచవృత్తులపై ఆధారపడి జీవనం సాగించేవారు. వారిలో శిల్పులు, బంగారం పని చేసే వారికి ఆదరణ పథకం ద్వారా లబ్ధి జరిగేది. ఇప్పుడు లేదు. పద్మశాలీలు, దేవాంగులు వారి వారి చేతి వృత్తులకు అభివృద్ధికి గత టీడీపీ ప్రభుత్వం ఆదుకుంది. గత ఐదేళ్లుగా వారికి సంక్షేమం లేదు. అగ్నికుల క్షత్రియులు కూడా ఎన్నో పథకాలు కోల్పోయారు.

బీసీ డిక్లరేషన్ శుభపరిణామం



బీసీలను జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. నిధులు దారి మళ్లించి సంక్షేమాన్ని విస్మరించింది. అందుకే బీసీలను అభివృద్ధి చేసేందుకు చంద్రబాబు బీసీ డిక్లరేషన్ ప్రకటించారు. ఇది శుభ పరిణామం. బీసీల ఆత్మగౌరవాన్ని మా నాయకుడు చంద్రబాబు నిలబెట్టారు. ఇంతకాలం బీసీలకు రక్షణ లేదు. ఇక అటువంటివి చెల్లవు. బీసీ రక్షణ చట్టాన్ని టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి వచ్చాక తీసుకువస్తుంది. రూ.5 వేల కోట్లతో ఆదరణ పథకం పునరుద్ధరణ, స్వయం ఉపాధికి ఐదేళ్లలో రూ.10 వేల కోట్లు ఖర్చు చేయడం, రూ.లక్షన్నర కోట్లతో బీసీ సబ్‌ప్లాన్, చట్టసభల్లో 33 శాతానికి రిజర్వేషన్ కోసం తీర్మానం చేసి కేంద్రానికి పంపించడం, స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు 34 శాతానికి పెంచడం అద్భుతం.

- ఆదిరెడ్డి శ్రీనివాస్, టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి, రాజమహేంద్రి

త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

- ఎన్నికల విధులను చట్టబద్ధతతో నిర్వర్తించాలి
- జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కే మాధవీలత

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 5: త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న దృష్ట్యా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. మంగళవారం ఎన్నికల విధులు-బాధ్యతలపై కలెక్టరేట్‌లో జేసీ ఎస్.తేజ్‌భరత్, జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులుతో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, ఉత్తర్వుల మేరకు చేపడుతున్న కార్యకలాపాలు సమర్థవంతంగా చేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి రెవెన్యూ అధికారి సమన్వయకర్తగా కీలకమైన బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. నోటిఫికేషన్ విడుదల కాగానే పనులకు ఎటువంటి జాప్యానికి తావులేకుండా చేయాలన్నారు. ఈసమావేశంలో ఏవో బీవీఎస్ రావు, కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు.



విజ్జేశ్వరం బ్యారేజీ మీద భారీ వాహనాలు వెళ్లకుండా ఏర్పాటుచేసిన గడ్డర్లను తొలగించడంతో లారీలు, ఇసుక లారీలు ప్రయాణిస్తున్న దృశ్యం

బ్యారేజీపై ఇసుక దొంగలు!

- ఇరిగేషన్ సిబ్బందిపై దాడి.. విజ్జేశ్వరం వద్ద గడ్డర్లు తొలగించి స్కవర్ స్లూయిజ్‌లో పడేసిన వైనం
- కొవ్వూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా స్పందన కరవు
- ఇసుక లారీలతో ఇటీవల వేసిన రోడ్డు ధ్వంసమయ్యే పరిస్థితి

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

ధవళేశ్వరం-విజ్జేశ్వరం మధ్య గోదావరి కాటన్ బ్యారేజీ మీద మళ్లీ ఇసుక దొంగలుపడ్డారు. ఐదేళ్లుగా ఈ బ్యారేజీ రోడ్డు అధ్వానంగా ఉండడంతో జనం నరకం అనుభవించారు. కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఆదేశాలతో ఇక్కడ కొంతమేర రోడ్డు మరమ్మతులు, నిర్మాణం చేయించిన సంగతి తెలిసిందే. ఆ పనులు ఇంకా పూర్తిస్థాయిలో ముగియలేదు. కానీ ఈలోగా ఇసుకలోడ్‌తో భారీ లారీలు ఈ రోడ్ల మీద, రాత్రీ పగలూ దూసుకుపోతున్నాయి. అంతే కాదు ఇసుకాసురులు ఎంతకు తెగించారంటే బ్యారేజీ రక్షణ కోసం కాపలా ఉన్న లస్కర్ల మీద దాడిచేశారు. విజ్జేశ్వరం వైపు నుంచి భారీ వాహనాలు రాకుండా రోడ్డుకు అడ్డంగా పెట్టిన గడ్డర్లను భారీ వాహనాలతో గుద్దించి, వాటిని తొలగించి, సమీపంలోని స్కవర్ స్లూయిజ్‌లో పడేశారు. అడ్డుకున్న వారిని కొట్టారు. ఈ ఘటన ఈనెల 1వ తేదీ రాత్రి వేళ జరిగింది. ఇరిగేషన్ అధికారులు దీనిపై స్పందించి కొవ్వూరు రూరల్‌పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇంతవరకూ స్పందన లేదు. వాస్తవానికి కాటన్ బ్యారేజీ మీద భారీ వాహనాలు, లోడ్ వాహనాలు నిషిద్ధం. దీంతో విజ్జేశ్వరం వైపు భారీ వాహనాలు వెళ్లకుండా గడ్డర్లు ఏర్పాటుచేశారు. ఇటీవల రాజవరం, బొబ్బర్లంక తదితర ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు మొదలయ్యాయి. అక్కడ నుంచి విజ్జేశ్వరం మీదగా నిడదవోలు, తాడేపల్లిగూడెం వైపు, రావులపాలెం వైపు ఇసుక తరలిస్తున్నారు. బెంజ్‌లారీలను ఉపయోగించి రాత్రి వేళల్లో కూడా తరలిస్తున్నారు. దీనికి గడ్డర్లు అడ్డువచ్చాయి. ఈనెల 1వ తేదీ రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో కోనసీమ ముఖద్వారానికి చెందిన ఓ వైసీపీ ఎమ్మెల్యే వర్గీయులుగా ఉన్న మద్దూరులంక, బొబ్బర్లంక గ్రామాలకు చెందిన కొద్దిమంది ఈ గడ్డర్లను భారీ వాహనాలతో గుద్దించి స్కవర్ స్లూయిజ్‌లో పడేశారు. ఈ సమయంలో విధుల్లో ఉన్న వాచ్‌మన్ బొర్రా సత్యనారాయణ, సహాయకుడు బొర్రా సత్తిబాబు అడ్డురావడంతో వారిపై ఇసుకాసురులు దాడిచేసి గాయపరిచారు. చంపేస్తామని కూడా హెచ్చరించారు. ఇదే పరిస్థితి గతేడాది కూడా జరిగింది. అప్పట్లో ఇసుకాసురులు లస్కర్లపై దాడిచేస్తే ఇరిగేషన్ ఉద్యోగులు ఆందోళన చేసి అక్కడ గడ్డర్లు ఏర్పాట్లు చేశారు. వాటినే ఇప్పుడు తొలగించి పడేశారు. వాచ్‌మన్‌పై దాడి, గెడ్డర్ల తొలగింపుపై ఇరిగేషన్ ఏఈ కె.నాగలక్ష్మి ఇటీవల కొవ్వూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కానీ ఇంతవరకూ స్పందనలేదు. ఉద్యోగులపై దాడిచేసినా, ఐరన్ గడ్డర్లు తొలగించినా, నిబంధనలకు విరుద్ధంగా బ్యారేజీపై ఇసుక లారీలు దూసుకుపోతున్నా, ఏమీ పట్టించుకోవద్దని ఇరిగేషన్ అధికార్లపై వైసీపీ నేతలు, ఉన్నతాధికారులు కూడా ఒత్తిడి చేయడం గమనార్హం. ఈనేపథ్యంలో ఉద్యోగులు భయంతో విధులు నిర్వహిస్తున్నారు. తొలగించిన గడ్డర్ల స్థానంలో ఇప్పటివరకు తిరిగి ఏర్పాటుచేయలేదు. ఇదే పరిస్థితి కొనసాగితే బ్యారేజీ ధ్వంసం అవుతుంది. ఇప్పటికైనా చర్యలు చేపడతారో లేదో వేచిచూడాలి.



చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జక్కంపూడి భార్య రాజశ్రీ, ఎంపీపీ, జడ్పీటీసీ

వైసీపీ ఆధ్వర్యంలో వలంటీర్లు, ఆశ, అంగన్‌వాడీలకు వస్త్రాల పంపిణీ

సీతానగరం, మార్చి5: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మండలంలోని బొబ్బిల్లంక పంచాయతీ కార్యాలయంలో వైసీపీ ఆధ్వర్యంలో ఆశ, అంగన్‌వాడీ, వలంటీర్లకు సోమవారం వస్త్రాలు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి రజాక్ స్వయంగా కార్యక్రమంలో పాల్గొనడం విశేషం. పార్టీ కార్యక్రమాలను అధికారిక కార్యక్రమాలుగా ఎలా నిర్వహిస్తారని ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రజాక్‌ను టీడీపీ నాయకులు ప్రశ్నించారు. తనకు ఎంపీడీవో నుంచి సర్క్యులర్ వచ్చిందని, దాంతో దగ్గరుండి జరిపిస్తున్నానని చెప్పడంతో సర్క్యులర్ చూపించమని తెలుగుదేశం నాయకులు పెండ్యాల మోహన్, కొత్తపల్లి వీర్రాజు, పెండ్యాల అవిస్వామి, పోలిన కృష్ణ, మణికంఠ తదితరులు కార్యదర్శిని నిలదీశారు. సర్క్యులర్ తన వద్ద లేదని తర్వాత చూపిస్తానని చెప్పడంతో టీడీపీ నాయకులు అభ్యంతరం చెబుతూ జనసేన నేత బత్తుల బలరామకృష్ణ, టీడీపీ నేత బొడ్డు వెంకటరమణ చౌదరిలను తీసుకువచ్చి తాము కూడా కార్యక్రమాలు చేపడతామని దగ్గరుండి చేయాలని కార్యదర్శిని కోరారు. మీరు కూడా సర్క్యులర్ తెచ్చుకోండని కార్యదర్శి అనడంతో కొద్దిసేపు వాగ్వాదం జరిగిన ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ కార్యక్రమానికి సంబంధించి ఎటువంటి ఫొటోలు తీయవద్దని వైసీపీ నాయకులు అడ్డగించడంతో వీరికి టీడీపీ నాయకులకు మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. కాగా స్థానికంగా ఉన్న వలంటీర్లు, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లకు మగవారికి ప్యాంటు షర్టు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో వైసీపీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి రాజశ్రీతోపాటు ఎంపీపీ, జడ్పీటీసీ తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో వైసీపీ నాయకులు ఇలా తాయిలాలు ఇవ్వడం పట్ల ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

తాయిలాల వలతో



- వైసీపీ బహుమతుల నజరానా
- డిన్నర్‌సెట్లు, చీరలు వగైరా..
- వలంటీర్లపై మళ్లీ దొంగ ప్రేమ
- ఆశాలు, అంగన్వాడీలకూ బురిడీ
- మంత్రి చెల్లుబోయిన అధికార దుర్వినియోగంపై జనం మండిపాటు
- తాజాగా బొబ్బిలంకలో చీరల పంపిణీ
- గిఫ్టుల ఖర్చు ఏ ఖాతాలోకో మరి

'సిద్ధం' అంటూ తెరముందు చెప్పేవి పౌరుష పదజాలం.. తెరవెనుక నిస్సిగ్గుగా తాయిలాలతో గేలం.. ఇదీ వైసీపీ నాయకుల ప్రలోభాల కథా చిత్రమ్. ఎన్నికల నోటిఫికేషన్ ఏ క్షణంలోనైనా రావచ్చనే సమయంలో వైసీపీ నేతలు విచ్చలవిడిగా బహుమతులతో ఓటర్లకు వల విసరడం మొదలు పెట్టేశారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బందిని ఈ కుతంత్రంలో భాగస్వాములను చేశారు. ఓటర్ల లిస్టులను పరిశీలించి, వలంటీర్ల వద్ద ఆరా తీసి తాయిలాల పంపకానికి సిద్ధపడుతున్నారు. ఈ పనిని తమ అనుయాయులకు ప్రత్యేకంగా అప్పగించారు. ప్రాంతాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి మరీ ప్రలోభాలను పంచిపెడుతున్నారు. వలంటీర్లది అసలు ఉద్యోగమే కాదని చెప్పిన నోటితోనే పొగుడుతూ.. ఆశాలు, అంగన్వాడీలను ముప్పుతిప్పలు పెట్టిన అధికారంతోనే మభ్యపెడుతూ మళ్లీ మోసానికి సిద్ధమంటూ తాయిలాల వలవిసురుతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేసరికే 'చక్కబెట్టేసి'.. నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఖర్చు విషయంలో తాము సుద్ద పూసలమనే రీతిలో ముందస్తు తాయిలాల పంపిణీ కానిచ్చేస్తున్నారు.

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

జగన్ ప్రభుత్వం వచ్చాక నిలువునా దగాపడిన వాళ్లలో ముందువరుసలో వలంటీర్లు ఉంటారు. సేవ ఎక్కువ రాబడి తక్కువ కావడంతో ఆర్థికంగానూ ఇబ్బందుల్లో మునిగిపోయారు. పీజీలు చదివినవారు సైతం ఉద్యోగ జీవితంలో ఈరోజు కాకపోతే రేపైనా ఎదుగుదల ఉంటుందనుకొని.. ప్రభుత్వం ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేయకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో వలంటీర్లుగా చేరారు. కేవలం రూ.5 వేలకు చాకిరీ విధులకు ఒప్పుకున్నారు. కొద్దిరోజుల కిందట తమకు జీతాలు పెంచాలని వలంటీర్లు గొంతెత్తక తప్పలేదు. అయితే అసలు మీది ఉద్యోగమే కాదు.. సేవ అని తేల్చేశారు. కానీ ఇప్పుడు వైసీపీ నాయకులకు వలంటీర్లే గతయ్యారు. వారి ద్వారానే ఎన్నికల ప్రలోభాల సినిమా నడిపిస్తున్నారు. ఈ ఐదేళ్ల కాలంలో వలంటీర్ల ద్వారా ఆయా కుటుంబాల డేటాను సేకరించారు. అది అంతా ప్రభుత్వం వద్ద ఉంది. ఇప్పుడు ఆ జాబితా ద్వారా ప్రతి వలంటీర్లు ఇన్ని ఓట్లు ఫ్యానుకు వేయించాలంటూ తాయిలాలతో భ్రమపెడుతున్నారు. దీనిని కొందరు వలంటీర్లు వ్యతిరేకిస్తుండగా.. కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియలో వలంటీర్ల నీడ ఎట్టి పరిస్థితుల్లోనూ పడడానికి వీలు లేదని కేంద్ర ఎన్నికల సంఘం హెచ్చరింపులను కూడా వైసీపీ నాయకులు పట్టించుకోలేనంతగా బరితెగిస్తున్నారు. అవ్వాతాతలను తీసుకొచ్చి ఓటు వేయించాలంటూ సాక్షాత్తూ జగన్ చెప్పడం ప్రజాస్వామ్యవాదులకు విస్మయం కలిగిస్తోంది.

● ఆశాలు, అంగన్వాడీలకు దగా

ఆశాలు అడిగినవన్నీ చేసేస్తాం.. అంగన్వాడీలకు తెలంగాణకంటే ఎక్కువ జీతాలు ఇచ్చేస్తాం.. గత ఎన్నికల్లో జగన్ చేసిన వాగ్దానాలవి. కానీ తర్వాత వాళ్లను పట్టించుకున్న దాఖలాలు లేవు. ఐదేళ్లలో ఎన్నోసార్లు తమ న్యాయమైన డిమాండ్లు తీర్చాలంటూ వినతిపత్రాలు అందించినా కనీసం కన్నెత్తి చూడలేదు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయాలని అడిగినా ప్రభుత్వంలో కదలిక రాలేదు. చివరకు ఆశాలు, అంగన్వాడీలు నెలల తరబడి రోడ్డెక్కి నిరసన చేయాల్సి వచ్చింది. వాళ్లను పోలీసుల సహాయంతో బంధించి సంతకాలు చేయించుకొని పంపించారు. ఇటు అంగన్వాడీ సెంటర్ల తాళాలు సచివాలయ సిబ్బందితో బద్దలు కొట్టించిన ఘనత మూటగట్టుకున్నారు. ఎన్నికల వేళ మళ్లీ వాళ్లను వైసీపీ ప్రభుత్వం దగా చేస్తోంది. తాయిలాలు ఇస్తూ మభ్యపెడుతోంది. గత ఎన్నికల సమయంలో జగన్ మాటలు నమ్మిన ఆశాలు, అంగన్వాడీలు ఇంటింటికీ వెళ్లి ఫ్యానుకు ఓటేస్తామని ప్రమాణాలు చేయించుకున్నారు. జగన్ అప్పట్లో ఎడాపెడా హామీలను గుప్పించి ఆశాలు, అంగన్వాడీ వర్కర్ల ద్వారా పెద్ద మేలే పొందారు. తర్వాత మోసం ఎలా ఉంటుందో చూపించారు.

● చెల్లుబోయిన.. ఇలా చెయ్యొచ్చా..!

వైసీపీలో చిన్నపెద్దా తేడా లేదు. ఎవరి దారిలో వారు ఓటర్లను ప్రలోభ పెట్టే పనిలో బిజీ అయిపోయారు. పగలు వీధుల్లో తిరగడం.. రాత్రివేళల్లో తాయిలాల తంతు కానివ్వడంలో బిజీ అయిపోయారు. దీనికోసం కుటుంబీకులు, బంధువులను కూడా రంగంలోకి దింపుతున్నారు. అనుయాయులను వారికి జత చేస్తున్నారు. సమాచార ప్రసార శాఖామంత్రి అయిన చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఓటర్లను ప్రలోభ పెట్టడంలో ఏకంగా తాయిలాల తరలింపునకు ప్రభుత్వ వాహనాన్ని సిబ్బందిని వాడేస్తున్నారు. సమాచారశాఖకు చెందిన వ్యాను ఒకటి కొన్ని నెలలుగా రాజమహేంద్రవరంలోని వేణు తాత్కాలిక నివాసం వద్ద అందుబాటులో ఉంచుతున్నారు. సమాచార శాఖ కమిషనర్ ఒప్పుకోకపోయినా ఆయనపై ఒత్తిడి తీసుకొచ్చి మరీ ఆ వ్యాన్‌ను మంత్రిగారు తాత్కాలికంగా సొంతం చేసుకున్నారు. దీంతో ప్రభుత్వ డ్రైవర్ ఇతర సిబ్బంది కూడా వాహనంతోపాటు అందుబాటులో ఉంటున్నారు. ఆయన పోటీలో ఉన్నట్టు చెబుతున్న రాజమహేంద్రవరం రూరల్‌లో వైసీపీ మీటింగులకు జనాలను తరలించడానికీ ఆ వాహనాన్ని వాడుతున్నారు. మరీ బరితెగించి ధవళేశ్వరంలో పంచడానికి గిఫ్టల తరలింపునకూ ఆ వాహనాన్ని వాడడంపై తీవ్ర విమర్శలు రేకెత్తుతున్నాయి. ఇందులో భాగంగా ప్రభుత్వ, సచివాలయ సిబ్బందితో మంత్రి చెల్లుబోయిన వేణు కుమారుడు ఏ హోదాలో సమావేశం ఏర్పాటుచేశారో సమాధానం దొరకని ప్రశ్నగా మారింది.

● ఈ ఖర్చు ఏ ఖాతాలోకి?

ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఖర్చు పెట్టే ప్రతి పైసాకు ఎన్నికల సంఘానికి లెక్క చెప్పాల్సి ఉంటుంది. ఎన్నికల సంఘం నియమించే పరిశీలకులు ఎప్పటికప్పుడు లెక్కలు గమనిస్తూ ఉంటారు. దీంతో ఎన్నికల నోటిఫికేషన్ రాకకు ముందే ఓట్లను బుట్టలో వేసుకునే పనిలో వైసీపీ నాయకులు నిమగ్నమయ్యారు. ఇప్పుడైతే ఖర్చును ఎవరికీ చెప్పాల్సిన పని ఉండదు. లెక్కలు ఇష్టానుసారం రాసేసుకోవచ్చు. బిల్లులను గోల్‌మాల్ చేసేసినా అడిగేవారుండరు. దీంతో వైసీపీ నాయకులు ఎక్కడికక్కడ చీకటి వేళల్లో మీటింగులు పెట్టి తాయిలాల పంపకం చేస్తున్నారు. దీనికి లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఇటీవల వైవీ సుబ్బారెడ్డి చేసిన వ్యాఖ్యలను బట్టి ఇప్పటి వరకూ వైసీపీ ఎవరినీ అభ్యర్థులుగా ప్రకటించలేదు. మార్చి 10న మేదరిమెట్ల సభ తర్వాత ఆ తతంగం ఉంటుందని ఆయన తేల్చేశారు. అయినా.. వైసీపీ సిట్టింగులు, బదిలీలపై వచ్చిన వాళ్ల ఖర్చులో ఎక్కడా తగ్గడం లేదు. జిల్లాలోని రాజమహేంద్రవరం రూరల్, సిటీ, గోపాలపురం నియోజకవర్గాల విషయంలో ఒక స్పష్టత ఉన్నప్పటికీ రాజానగరం, నిడదవోలు, అనపర్తి నియోజకవర్గాల్లో ఇంకా ఎటూ తేలలేదు. కానీ అక్కడి సిట్టింగ్‌లంతా ఎన్నికల నేపథ్యంలో ముఖ్య పాత్ర వహించే వారికి తాయిలాల పంపిణీకి విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారు. ఈ ఖర్చంతా ఏ ఖాతాల్లో లెక్కలు చూపిస్తారో ఫ్యాను గాలికే తెలియాలి.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు

తప్పును నిలదీస్తే చెప్పుతో కొడతా అంటావా

- భరత్‌రామ్.. నిన్ను చెప్పులతో కొట్టడానికి ప్రజలు సిద్ధం
- మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, జనసేన నేత అనుశ్రీ

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 5: రాజమహేంద్రవరంలో ఒక వలంటీరు వైసీపీకి అనుకూలంగా లేకపోతే సంక్షేమ పథకాలు రద్దు చేస్తామని ప్రచారం చేస్తుంటే.. ఆ తప్పును తాను నిలదీస్తే తనను చెప్పుతో కొడతా అని ఎంపీ భరత్‌రామ్ అనడం అతని కుసంస్కారానికి నిదర్శనమని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన, జనసేన సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ ఏడు నియోజకవర్గాల ప్రజలు నిన్ను ఎంపీగా గెలిపిస్తే రాజమహేంద్రవరానికి పరిమితమై మిగతావాటిని గాలివదిలేస్తే, అక్కడ ప్రజలు చెప్పులతో నిన్ను కొట్టడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. రాళ్ల పేర్చి, లైట్లు వెలిగించి దానిని అభివృద్ధి అని అనడం సిగ్గుమాలిన చర్య అన్నారు. నువ్వు చేసిన అవినీతి అక్రమాలను కచ్చితంగా ప్రశ్నిస్తామన్నారు. ఆవభూములు, బ్యూటిఫికేషన్ పేరుతో నువ్వు ఎంత దోచేశావో టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి వచ్చాక అన్నీ నిగ్గుతేలుస్తుందన్నారు. జనసేన నేత అనుశ్రీ సత్యనారాయణ మాట్లాడుతూ ఆదిరెడ్డి అప్పారావుపై ఎంపీ భరత్‌రామ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎంపీ భరత్‌రామ్‌కు బెల్ట్ దెబ్బలు తినే రోజులు దగ్గరపడుతున్నాయన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు, అధికార ప్రతినిధి దాస్యం ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ద్వారా పార్వతి సుందరి, తెలుగు మహిళా పార్లమెంట్ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి, నగర అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ, ఆర్గనైజింగ్ సెక్రటరీ మీసాల నాగమణి పాల్గొన్నారు.

ఓటర్లకు ఇబ్బందులు లేకుండా చూడాలి

సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ.. పలు పోలింగ్ కేంద్రాల పరిశీలన



వేగేశ్వరపురంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శ్రీవాత్సవ

తాళ్లపూడి, మార్చి 5: వేగేశ్వరపురంలోని 28వ పోలింగ్ స్టేషన్ వద్ద డ్రైనేజీ పనులు పూర్తి చేసి ఓటర్లకు ఇబ్బందులు లేకుండా చూడాలని, మరికొన్ని పోలింగ్‌స్టేషన్లలో చిన్న చిన్న లోపాలను సరిచేయాలని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని తాళ్లపూడిలో 20,21 పోలింగ్‌స్టేషన్లు, వేగేశ్వరపురంలో 25,26,27,28 పెద్దేవంలో 31,32,34 మలకపల్లిలో 39,40,41,42 పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే పలు సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను, వాటి పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వెంట తహశీల్దార్ శ్రీనివాసరావు, ఆర్ఐ కిషోర్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ప్రమాదాల నివారణకు భద్రత ప్రధానం



ఆంధ్రా షుగర్స్‌లో భద్రతపై కార్మికులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కొవ్వూరు, మార్చి 5: పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు భద్రత ప్రధాన పాత్ర పోషిస్తుందని కొవ్వూరు ఆంధ్రా షుగర్స్ ఫ్యాక్టరీ మేనేజర్ ఈవీ కృష్ణారావు అన్నారు. మంగళవారం ఫ్యాక్టరీలో నిర్వహించిన జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆయన మాట్లాడుతూ భద్రత పరిశ్రమలకే పరిమితం కాదని, వ్యక్తిగతంగాను పర్యావరణాన్ని రక్షించడం, కార్మికుల ఆరోగ్యం వంటి అంశాల్లో భద్రతకు అత్యంత ప్రాధాన్యముందని చెప్పారు. ఈ నెల 10వ తేదీ వరకు ఎస్‌సీబీఏ ఆపరేటస్, అగ్నిమాపక సాధనాలు, యంత్రాలు, భద్రతా పరికరాల వినియోగంపై ఫ్యాక్టరీ ఉద్యోగులు, కార్మికులకు అవగాహన కల్పించనున్నట్టు సేఫ్టీ ఇన్‌చార్జి కేవీవీ సత్యనారాయణమూర్తి చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ ఏజీఎం సీహెచ్ఎస్. మహర్షి, ఎలక్ట్రికల్ అడిషనల్ చీఫ్ ఇంజనీరు జె.రఘు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ

కొవ్వూరు, మార్చి 5: కొవ్వూరు మున్సిపల్ కార్యాలయంలో జగనన్న కాలనీలో లబ్ధిదారులకు రిజిస్టర్డ్ ఇళ్లపట్టాలు పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. పట్టాలను ఎమ్మెల్యే తలారి వెంకట్రావు లబ్ధిదారులకు అందజేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలన్నీ రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.మస్తాన్, మున్సిపల్ కమిషనర్ కె.డానియేల్ జోసఫ్, కౌన్సిలర్లు కంటమణి రమేష్‌బాబు, అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, రుత్తల బాస్కరరావు, సఖినేటిపల్లి చాందిని, వరిగేటి లలితకుమారి పాల్గొన్నారు.

మహిళా కౌన్సిలర్లకు సత్కారం



నిడదవోలులో కౌన్సిలర్లను సత్కరిస్తున్న ఆర్యవైశ్య మహిళా సంఘ ప్రతినిధులు

నిడదవోలు, మార్చి 5: మహిళా దినోత్సవం సందర్భంగా నిడదవోలులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మంగళవారం మున్సిపల్ వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్ చిలకల శారదాదేవిలను ఘనంగా సత్కరించారు. ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కొనకళ్ల శేష, జల్లూరి నాగ పుష్పావతి, కందగట్ల భాగ్యలక్ష్మి, బోనగిరి పద్మజ పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా హోమ్‌కు బియ్యం వితరణ

కొవ్వూరు, మార్చి 5: కొవ్వూరులోని మదర్ థెరిస్సా హోమ్‌కు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు బియ్యం పంపిణీచేశారు. శాంతి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న మదర్ థెరిస్సా హోంను మంగళవారం డిగ్రీ విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా బియ్యం అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పుష్పాంజలి, రత్నవినోల, కాంచనమాల, సునీత పాల్గొన్నారు.

16న జాతీయ లోక్ అదాలత్



ప్రిన్సిపల్ సివిల్ జడ్జి రామకృష్ణ

నిడదవోలు, మార్చి 5: నిడదవోలులోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఈ నెల 16న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9న జరగవలసిన లోక్ అదాలత్ 16వ తేదీకి మారిందని, కక్షిదారులు ఈ అదాలత్‌ను వినియోగించుకోవాలన్నారు.

ఇంటర్ ఇంగ్లీషు పరీక్షకు 10 మంది గైర్హాజరు

కొవ్వూరు, మార్చి 5: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీషు పరీక్ష కొవ్వూరులో మంగళవారం ప్రశాంతంగా జరిగింది. పట్టణ, మండలంలో 463 మంది విద్యార్థులు పరీక్ష రాయవలసి ఉండగా 453 మంది హాజరు కాగా 10 మంది గైర్హాజరయ్యారు. కొవ్వూరు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో 291 మందికి గాను 285 మంది, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 172 మందికి గాను 165 మందికి హాజరయ్యారు.

విశ్వకర్మ యోజనతో మహిళలకు జీవనోపాధి

బీజేపీ మహిళా మోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మలకిషోర్



శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్మలకిషోర్

దేవరపల్లి, మార్చి 5: విశ్వకర్మ యోజన(పథకం) ద్వారా మహిళలు జీవనోపాధి పొంది ఆర్థికంగా మరింత బలపడతారని బీజేపీ మహిళా మోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు, ఇండియన్ రైల్వే పీఏసీ సభ్యురాలు బొల్లిన నిర్మలకిషోర్ అన్నారు. మండలంలోని యర్నగూడెంలో పార్డ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణా శిబిరంలో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మహిళలకు జీవనోపాధికి అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. విశ్వకర్మ పథకం ద్వారా మహిళలకు 18రకాల చేతివృత్తులకు సంబంధించి శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా పార్డ్ ఇండియా సంస్థ సేవలను కొనియాడారు. పార్డ్ ఇండియా జాతీయ గౌరవాధ్యక్షుడు కారుమంచి గణేష్ మాట్లాడుతూ బేతాళ వీరాస్వామి సంస్థను స్థాపించి గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు సేవలు విస్తరింపజేశారన్నారు. కుట్టులో శిక్షణ అనంతరం మహిళలకు మిషన్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పార్డ్‌ఇండియా సభ్యులు అచ్యుతరావు, రవీంద్ర, సోమిశెట్టి వెంకట్రావు, డేవిడ్, సత్యనారాయణ, అనీల్‌కుమార్, దుర్గాభవాని పాల్గొన్నారు.

16న రక్తదాన శిబిరం

తాళ్లపూడి, మార్చి 5: తాళ్లపూడిలో ఈ నెల 16న నిర్వహించనున్న బ్లడ్ క్యాంప్, హెల్త్ క్యాంప్ పోస్టర్‌ను ఆర్యవైశ్య సంఘం, పలు సేవా సంస్థల ప్రతినిధులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ గౌరవాధ్యక్షుడు సింహాద్రి జనార్దనరావు మాట్లాడుతూ రక్తదాన, వైద్య శిబిరాల నిర్వహణ సమాచారాన్ని ప్రతిఒక్కరికి తెలియజేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మానవత సంస్థ సభ్యుడు జోడాల వెంకటేశ్వరరావు, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు గోకవరపు బాబులు, జి.ప్రమోద్‌కుమార్, గోకవరపు మాణిక్యం, దేవరపల్లి రవి, చంద్రశేఖర్, చిన్నూ పాల్గొన్నారు.

రేపు కొవ్వూరు సర్వసభ్య సమావేశం

కొవ్వూరు, మార్చి 5: కొవ్వూరు మండల పరిషత్ అత్యవసర సమావేశం ఈ నెల 7వ తేదీ ఉదయం 10 గంటలకు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.సుశీల తెలిపారు. ఎంపీపీ కాకర్ల నారాయుడు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని చెప్పారు.

ఉమ్మడి కూటమిని అధికారంలోకి తేవడమే లక్ష్యం

» టీడీపీ-జనసేన అభ్యర్థి ఆదిరెడ్డి వాసు, జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ



పార్టీలోకి చేరిన కార్యకర్తలతో ఆదిరెడ్డి వాసు, అనుశ్రీ

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 5: రాష్ట్ర భవిష్యత్తు, మన బిడ్డల భవిష్యత్తు కోసం టీడీపీ-జనసేన ఉమ్మడి కూటమిని ఎన్నికల్లో అధికారంలోకి తీసుకురావడమే ఉమ్మడి లక్ష్యమని టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన రాజమహేంద్రవరం ఇన్‌చార్జ్ అనుశ్రీ సత్యనారాయణ అన్నారు. రాజమహేంద్రవరం 46వ డివిజన్‌లో మంగళవారం రాత్రి జరిగిన చేరికల కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా విచ్చేసి వైసీపీ నుంచి టీడీపీ-జనసేన కూటమిలోకి చేరిన 150 మంది కార్యకర్తలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలకు సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. జగన్‌ను ఇంటికి పంపించి వేయాలన్నారు. కార్యక్రమంలో తెలుగు మహిళా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ తురకల నిర్మల, మండల రవికుమార్, మజ్జి రాంబాబు, ఆగురు ధనరాజ్, మొకమాటి సత్యనారాయణ, రమణ, సలాది ఆనంద్, లక్ష్మి పాల్గొన్నారు.

మహిళా సాధికారత టీడీపీతోనే సాధ్యం: రామకృష్ణారెడ్డి

అనపర్తి, మార్చి 5: మహిళా సాధికారత టీడీపీతోనే సాధ్యపడుతుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో బాటు మహాశక్తి ద్వారా మహిళలకు చేకూరే ప్రయోజనాలను వివరిస్తూ అనపర్తిలో మంగళవారం తెలుగు మహిళలు ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మహాశక్తి పథకాలను వివరించారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు గతంలో టీడీపీ ప్రభుత్వాలు అనేక పథకాలను ప్రవేశపెట్టాయని రామకృష్ణారెడ్డి గుర్తుచేశారు. కార్యక్రమంలో తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు జుత్తుగ సూర్యకుమారి, పోతంశెట్టి సూర్యకుమారి, వేణమ్మ, కొవ్వూరి పార్వతి, సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, బాసి పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేశ్‌పై కేసుల వివరాలివ్వండి

2019 నుంచి తూర్పుగోదావరి జిల్లాలో టీడీపీ అధినేత చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌లపై పోలీసులు నమోదు చేసిన కేసుల వివరాలను తెలపాలని కోరుతూ మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ జగదీష్‌కు రామకృష్ణారెడ్డి లేఖను అందజేశారు. ఈ విషయాన్ని స్థానిక విలేకరులకు తెలియజేశారు.



అనపర్తిలో సూపర్ సిక్స్ పథకాలను ప్రచారం చేస్తున్న రామకృష్ణారెడ్డి

చెంప దెబ్బకు భార్య మృతి

» ఘర్షణ నేపథ్యంలో ఘటన.. భర్తపై హత్య కేసు నమోదు



మృతురాలు సాయిదీపిక

కొవ్వూరు, మార్చి 5: ఘర్షణ పడే క్రమంలో భర్త.. భార్య చెంపపై కొట్టడంతో మృతిచెందిన ఘటన కొవ్వూరు మండలం మద్దూరులో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మద్దూరుకు చెందిన సంద్ర వీరబాబుకు, అత్తిలి గ్రామానికి చెందిన లావణ్య సాయిదీపిక(32)తో 2010లో వివాహం జరిగింది. వీరికి కుమారుడు జయశంకర్, కుమార్తె కుందన ఉన్నారు. వీరబాబు తాపీ పనిచేస్తుంటాడు. మద్యం, పేకాట, కోడి పందాలకు బానిస కావడంతో భార్యాభర్తల మధ్య తరచూ డబ్బు విషయమై గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం డ్వాక్రా రుణానికి సంబంధించిన వాయిదా డబ్బు చెల్లింపు విషయంలో ఇద్దరు ఘర్షణపడ్డారు. ఈ కొట్లాటలో కోపంతో భార్యను వీరబాబు చేతితో చెంపపై గట్టిగా కొట్టాడు. దీంతో మాటలేకుండా లావణ్య కిందపడి మరణించింది. జరిగిన సంఘటనను వీరబాబు అత్తిలిలో ఉన్న అత్తమామలకు ఫోనులో తెలియజేయగా వారు హుటాహుటిన మద్దూరు రావడంతో లావణ్య చనిపోయిన విషయం బయటకు వచ్చింది. సమాచారం తెలియడంతో కొవ్వూరు డీఎస్పీ కె.రామారావు, సీఐ పి.శ్రీనివాసరావు, రూరల్ ఎస్ఐ కె.సుధాకర్ సంఘటనా స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులు, బంధువుల నుంచి వివరాలు సేకరించారు. లావణ్య తల్లిదండ్రులు బడేటి గణపతి, వెంకటలక్ష్మి మాట్లాడుతూ వివాహం జరిగినప్పటి నుంచి తమ కుమార్తెను సరిగా చూసుకోలేదని, భర్తతోపాటు అత్త సంద్ర సూర్యకుమారి బాధలు పెడుతూనే ఉన్నారని, అన్యాయంగా తమ కుమార్తెను చంపేశారని ఆరోపించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు భర్త, అత్తపై హత్య కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

నేడు దేవరపల్లి పొగాకు కేంద్రం ప్రారంభం

వేలం నిర్వహణాధికారి ప్రసాద్



దేవరపల్లి, మార్చి 5: దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం బుధవారం 9గంటలకు ప్రారంభించనున్నట్టు వేలం నిర్వహణాధికారి జీఎల్‌కే ప్రసాద్ తెలిపారు. మంగళవారం సాయంత్రం వేలం నిర్వహణ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం పరిధిలో 6.61 బిలియన్ కిలోల పొగాకుకు అనుమతి ఇవ్వగా 7.8 బిలియన్ కిలోలు ఉత్పత్తి అవుతుందని అంచనా వేశామన్నారు. అలాగే రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడు ప్రాంతంలో పండించే బ్లాక్ సాయిల్ పొగాకు ఈ సంవత్సరం 1.8మిలియన్ కిలోలకు అనుమతి ఇవ్వగా 2.5మిలియన్ కిలోలు ఉత్పత్తి అవుతుందని అంచనా వేశామన్నారు. గత ఏడాది దేవరపల్లి పొగాకు వేలం కేంద్రంలో సరాసరి కిలో ధర రూ.254.62 పైసలు ధర పలికిందని, గరిష్ట ధర రూ.287, కనిష్ట ధర రూ.160, బ్లాక్ సాయిల్‌లో సరాసరి రేటు రూ.201 అని గుర్తుచేశారు. పొగాకు వేలం ప్రక్రియ సజావుగా జరిగేందుకు రైతులు సహకరించాలని ప్రసాద్ కోరారు. పొగాకు బేలుకు రేటు నిర్ణయించడానికి కొన్ని సెకండ్ల ప్రక్రియ మాత్రమే ఉంటుందని, దీనికి సరైన వాతావరణం ఉండాలన్నారు. పొగాకు బేళ్లు వేలానికి తీసుకొచ్చేటప్పుడు అన్యపదార్థాలు ఉండకూడదని, తేమ శాతం తగిన విధంగా ఉండేలా చూసుకోవాలన్నారు. పొగాకు బేళ్లు 150 కిలోలకు మించి ఉండకూడదన్నారు. వేలం కేంద్రంలో సిబ్బంది కొరత ఉందని, ప్రస్తుతం ఉన్నవారితోనే సమర్థవంతం నిర్వహిస్తామని చెప్పారు.

కొవ్వూరు సీటు రామారావుకు కేటాయించాలి

ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు

కొవ్వూరు, మార్చి 5: టీడీపీ-జనసేన పొత్తులో భాగంగా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావుకు కొవ్వూరు సీటు కేటాయించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు చెట్టే సుజనరావు డిమాండ్ చేశారు. నిడదవోలులో మంగళవారం జరిగిన ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకుల అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జనసేన పార్టీకి కేటాయించిన 24 సీట్లలో ఎస్సీ సామాజిక వర్గానికి ఒక్క సీటూ కేటాయించకపోవడం మాదిగల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉందన్నారు. జనసేన పార్టీకి కేటాయించాలన్నారు. జనసేన అంటే దళితులకు అనుగుణంగా సిద్ధాంతాలు ఉన్న పార్టీ అని, ఎస్సీ నియోజకవర్గమైన కొవ్వూరు సీటును వైసీపీని వీడి జనసేనలో సేవలందిస్తున్న మాజీ ఎమ్మెల్యే రామారావుకు కేటాయించాలన్నారు. లేకుంటే జనసేన మాదిగలకు అన్యాయం చేసినట్లేనన్నారు. కార్యక్రమంలో ముప్పిడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సద్భావన విశ్వశాంతి యాత్ర

తాళ్లపూడి, మార్చి 5: మహాశివరాత్రి సందర్భంగా తాళ్లపూడిలో మంగళవారం ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సద్భావన విశ్వశాంతి యాత్ర నిర్వహించారు. మాజీ సర్పంచ్ నాయన పరమేశ్వరరావు పతాకావిష్కరణ చేసి యాత్రను ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో బ్రహ్మకుమారీలు లక్ష్మి, ఉమాసావిత్రి మాట్లాడుతూ ప్రపంచ శాంతి, సమసమాజ స్థాపన ధృక్పథంతో ముందుకు నడవడం, నడిపించడమే తమ సంస్థ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రతి గ్రామంలో ఉదయం, సాయంత్రం ఆధ్యాత్మిక జ్ఞానం, రాజయోగ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.

రేపు చాగల్లు మండల సర్వసభ్య సమావేశం

చాగల్లు, మార్చి 5: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 10గంటలకు జరుగుతుందని ఎంపీడీవో ఎస్.బుజ్జి తెలిపారు. మండల అభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించి తీసుకోవలసిన చర్యలపై సభ్యులు చర్చిస్తారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి తప్పక హాజరుకావాలని కోరారు

బంగారు ఆభరణాల చోరీపై కేసు

138 గ్రాముల బంగారం అపహరించిన దుండగులు

కొవ్వూరు, మార్చి 5: ఆర్టీసీ బస్సులో గుర్తుతెలియని మహిళలు బంగారు వస్తువులు అపహరించినట్టు ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ మహమ్మద్ జుబేర్ వివరాల ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రంలోని రాయగడకు చెందిన రేమళ్ల మంజుల ఈ నెల 2న రాయగడ నుంచి వైజాగ్‌లో వివాహానికి వచ్చింది. అనంతరం 3న అశ్వారావుపేటలో ఉన్న అన్నయ్యను కలవడానికి బయలుదేరింది. వైజాగ్ నుంచి ట్రైన్‌లో రాజమహేంద్రవరం వచ్చింది. కోటిపల్లి బస్టాండ్‌లో జంగారెడ్డిగూడెం బస్సు ఎక్కింది. ఆమెతో పాటు మరో నలుగురు మహిళలు బస్సు ఎక్కారు. వారు కొవ్వూరు హెచ్‌పీ పెట్రోలు బంకు వద్ద దిగిపోయారు. జంగారెడ్డిగూడెం టిక్కెట్టు తీసుకుని మధ్యలో ఎందుకు దిగిపోతున్నారని కండక్టర్ అడిగినా సమాధానం ఇవ్వకుండా దిగిపోయారు. కొంతదూరం వెళ్లిన తరువాత మంజుల తన బ్యాగులను సరిచూసుకుంది. బ్యాగులో ఉంచి 138 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో ఏంచేయాలో తెలియక అశ్వారావుపేట వెళ్లిపోయింది. మంగళవారం కొవ్వూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసునమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయం చేయాలి

చాగల్లు, మార్చి 5: వ్యవసాయం సేంద్రీయ పద్ధతిలో చేయాలని, అందరు ప్రోత్సహించాలని డీపీఎం హేమంత్ చెప్పారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన సమావేశం నిర్వహించారు. కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల్లోని మండలాల నుంచి ముగ్గురు చొప్పున ఎంపిక చేసిన వీఏవోలు హాజరై వారికి అవగాహన కల్పించారు. రసాయనాల వాడకం వల్ల ఆరోగ్యానికి నష్టమని, ఖర్చులు పెరిగి వ్యవసాయం భారమవుతుందన్నారు. సేంద్రీయ వ్యవసాయంపై రైతులకు అవగాహన పెంచి ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డీపీఎం వల్లి, తహశీల్దార్ ఎం.సావిత్రి, ఎంపీడీవో ఎస్.బుజ్జి పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి: హోం మంత్రి



ఘంటావారిగూడెం సభలో మాట్లాడుతున్న హోం మంత్రి వనిత

నల్లజర్ల, మార్చి 5: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి నాయకుడు పని చేయాలని హోంమంత్రి తానేటి వనిత అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆమె పర్యటించి రూ.6 కోట్ల విలువ చేసే అభివృద్ధి పనులకు ఆమె శ్రీకారం చుట్టారు. పోతవరంలో సీసీ రోడ్లు, రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులు, పోతవరం-యర్నగూడెం బీటీ రోడ్డునకు శంకుస్థాపన చేశారు. అవపాడులో వాటర్ ప్లాంట్ ప్రారంభించారు. కార్యక్రమాల్లో గూడూరి శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

నల్లజర్ల, మార్చి 5: మండలంలోని కవులూరు గ్రామంలో షిరిడి సాయిబాబా ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాకు కాకాడ హారతి, సుప్రభాతం, అఖండ సాయి నామం, అభిషేకాలు, సామూహిక సాయి సత్యవ్రతాలు జరిపారు. కార్యక్రమంలో గురుస్వాములు నీలపాల ప్రసాద్, కాట్రు శ్రీనివాస్, సాయి కుమారితోపాటు అధిక సంఖ్య భక్తులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో ఆయిల్‌పామ్ తోటల పరిశీలన



డ్రోన్ ద్వారా తోటలను పరిశీలిస్తున్న త్రీఎఫ్ ఆయిల్‌పామ్ సంస్థ సభ్యులు

నల్లజర్ల, మార్చి 5: డ్రోన్ ద్వారా ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించడం వల్ల పంట ఆరోగ్య స్థితిగతులు, చీడపీడలు, తెగుళ్ళు వంటివి గుర్తించి వెంటనే నివారణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని త్రీఎఫ్ ఆయిల్‌పామ్ సంస్థ జీఎం పి.విజయప్రసాద్ అన్నారు. మంగళవారం ముసుళ్లకుంట గ్రామంలో ఆయిల్‌పామ్ తోటలను ప్రయోగాత్మకంగా డ్రోన్ ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే ప్రథమంగా తమ సంస్థ డ్రోన్ ద్వారా తోట పరిశీలన కార్యక్రమం చేపట్టిందన్నారు. దీని ద్వారా గమనించిన ఫలితాలను విశ్లేషించి రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చి అధిక దిగుబడి పొందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు ఆదాయం పెంచడమే లక్ష్యంగా ఇటువంటి ప్రయోగాత్మక కార్యక్రమాలు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆర్అండ్‌డీ మేనేజర్ సునీత, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

20 టన్నుల రేషన్‌బియ్యం స్వాధీనం

ముగ్గురిపై 6ఎ కేసు నమోదు



కొవ్వూరు, మార్చి 5: అక్రమంగా తరలిస్తున్న 20 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్టు కొవ్వూరు సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్ జి.బాపిరాజు తెలిపారు. ఉండ్రాజవరం నుంచి కాకినాడ పోర్టుకు లారీలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారని సమాచారం రావడంతో సివిల్ సప్లయిస్ అధికారులు మంగళవారం తెల్లవారుజామున దాడులు చేశారు. కొవ్వూరు ఏషియన్ పేయింట్స్ గొడౌన్ సమీపంలో నేషనల్ హైవేపై లారీని సీజ్‌చేసి, లారీలో ఉన్న 20 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఘటనలో కాకినాడ జిల్లా కరపకు చెందిన లారీ డ్రైవర్ రాయుడు బాలాజీ, లారీ యజమాని నల్లా శివ, తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం గ్రామానికి చెందిన బియ్యం యజమాని బాషా 6ఎ కేసు నమోదు చేసినట్టు బాపిరాజు చెప్పారు

ఐకమత్యంతో టీడీపీ-జనసేన విజయానికి కృషి

ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

కడియం, మార్చి 5: టీడీపీ-జనసేన ఎమ్మెల్యే అభ్యర్థుల విజయానికి రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో కృషి చేయాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని జనసేన నాయకులను కలిసి ఐకమత్యంతో ముందుకెళదామని పిలుపునివ్వగా అభ్యర్థుల విజయానికి సహకారం అందిస్తామని వారు అన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, అన్నందేవుల చంటి, మార్గాని సత్యనారాయణ, వెలుగుబంటి నాని, బోడపాటి గోపి తదితరులున్నారు.

మహిళా ప్రముఖులకు సత్కారం

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 5: మహిళా దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ఆనంద్ గార్డెన్స్‌లో వాకర్స్ యోగా లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సమాజానికి సేవలందించిన మహిళా ప్రముఖులను ఘనంగా సత్కరించారు. మంగళవారం క్లబ్ వ్యవస్థాపకుడు పామర్తి గోపాలరావు, కార్యదర్శి గుబ్బల గంగాభవాని పర్యవేక్షణలో అధ్యక్షుడు శనపతి సత్తిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కందుకూరి వీరేశలింగం, రాజ్యలక్ష్మి దంపతుల చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. యోగా గురువు ఆశపు బాబాజీ దంపతులను సత్కరించారు. వారి సహకారంతో వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అలాగే మాజీ మేయర్ ఆదిరెడ్డి వీరరాఘవమ్మ, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు పి.లక్ష్మి, పూర్వ అధ్యక్షురాలు కె.రుక్మిణి, ఉపాధ్యాయురాలు డీఎస్ కళావతి, సమాజ సేవకురాలు మేడపాటి సాయిలను ఆదర్శ మహిళామణి పురస్కారాలతో సత్కరించారు. అనంతరం వృద్ధులకు పింఛన్లు అందించారు. కార్యక్రమంలో రాళ్ళబండి సత్యవాణి, కె.ధనలక్ష్మి, భేరి రత్నాంబ, కొత్తపల్లి గీత, లంకే శ్రీదేవి, సూరపురెడ్డి తాతారావు పాల్గొన్నారు.

నేటి నుంచి పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

గోపాలపురం, మార్చి 5: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం ఉదయం నుంచి పొగాకు కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్టు పొగాకు వేలం నిర్వహణాధికారి ఆమూల్‌డీశ్యామ్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 9.30గంటలకు పూజా కార్యక్రమం అనంతరం మొదటి రోజు కొనుగోళ్లకు 27 బేళ్లు కొనుగోలు చేసినట్టు తెలిపారు. బోర్డు పరిధిలోని రైతులంతా పొగాకు కొనుగోలు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా అయన కోరారు. .

దేవదాయ భూములన్నీ రామకృష్ణ మిషన్ పరిధిలోకి తెవాలి

ఎస్ఎస్ఎన్‌పీ అధ్యక్షుడు సుందరానంద్ పండిట్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 5: రాష్ట్రంలోని దేవదాయ భూములన్నీ రామకృష్ణ మిషన్ పరిధిలోకి తీసుకురావాలని సజ్జన సంగమ నేషనల్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ సుందరానంద పండింట్ డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులోని తన నివాసంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవదాయ భూములను రామకృష్ణ మిషన్ పరిధిలోకి తీసుకురావాలని సుప్రీంకోర్టు గతంలో చెప్పిందని, కాని పాలకులు దానిపై దృష్టి పెట్టలేదన్నారు. భూములు రామకృష్ణ మీషన్ పరిధిలోకి వస్తే వాటి ద్వారా వచ్చే ఆదాయంతో ప్రభుత్వాల కంటే మెరుగైన సేవలు ప్రజలకు అందుతాయన్నారు. మెరుగైన విద్య, ఉద్యోగవకాశాలు, కల్పించడం, కళలను ప్రోత్సహించడం, తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికి 50 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి అనేక పథకాలతో మేనిఫెస్టో రూపొందించామన్నారు. ఎన్నికల సంఘం గుర్తింపు ప్రక్రియలో తమ పార్టీ ఉన్నందున స్వతంత్ర అభ్యర్థులుగా పోటీకి దిగేవారికి తమ మద్దతు ఉంటుందన్నారు.

వాహన తనిఖీలు

గోపాలపురం, మార్చి 5: ఎన్నికల నేపథ్యంలో అంతర్‌జిల్లాల బోర్డర్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీఐ కే.బాలసురేష్‌బాబు అన్నారు. మండలంలోని జగన్నాథపురం శివారులో ఏర్పాటు చేసిన అంతర్ జిల్లాల చెక్‌పోస్టులో ఆయన మంగళవారం తనిఖీలు చేశారు. తనిఖీల్లో అనుసరించాల్సిన విధివిధానాలను సిబ్బందికి సూచించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

గోపాలపురం, మార్చి 5: జీడిమామిడి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని బాపట్ల జీడిమామిడి పరిశోధన కేంద్రం సీనియర్ సైంటిస్టు ఉమామహేశ్వరరావు రైతులకు సూచించారు. గోపాలపురంలో రైతు ముప్పన రమణారెడ్డి సాగుచేస్తున్న నాలుగున్న ఏకరాల జీడిమామిడి తోటను మంగళవారం శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రమణారెడ్డి జీడిమామిడి సాగును చూసిన రైతులు పలు ప్రాంతాల నుంచి బాపట్ల కేంద్రం నుంచి జీడిమామిడి తీసుకెళ్లి ఐదు వేల హెక్టార్లలో జీడిమామిడి సాగు చేస్తున్నట్టు చెప్పారు. చీడపీడల నివారణ, అధిక దిగుబడుల గురించి వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త జీ.శ్రవంతి, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీల ద్రోహి జగన్: మద్దిపాటి



వెంకటాయపాలెంలో శంఖారావం కార్యక్రమంలో మద్దిపాటి

గోపాలపురం, మార్చి 5: జగన్మోహన్‌రెడ్డి బీసీల ద్రోహి అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని వెంకటాయపాలెంలో మద్దిపాటి శ్రీను ఆధ్వర్యంలో శంఖారావం కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా శంఖారావం కరపత్రాలను, జయహో బీసీ కరపత్రాలు ఇంటింటికీ పంచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మద్దిపాటి మాట్లాడుతూ బీసీ సబ్‌ప్లాన్‌కు కేటాయించిన రూ.800కోట్లను దారిమళ్లించి వారి అభివృద్ధిని అధః పాతాళానికి తొక్కేశాడన్నారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కేటాయించిన 34శాతం రిజర్వేషన్‌ని 24శాతానికి తగ్గించాడన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ, కాండ్రేగుల మోహన్, కాండ్రేగుల శ్రీహరి, జ్యేష్ట శ్రీధర్, దొరబాబు, కూనపం ప్రసాద్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	సిద్ధార్థరాయ్
వై.స్క్రీన్2	ఈగల్
దేవిశ్రీ(గాయత్రి)	హనుమాన్
అనన్య	ఊరి పేరు భైరవ కోన

నిడదవోలు

వీ మ్యాక్స్	ఊరి పేరు భైరవ కోన
రాధాకృష	ఆపరేషన్ వాలంటైన్
శ్రీగణపతి	వ్యూహం

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్	సలార్
శ్రీనివాస	సలార్